నవతెలంగాణ
నమస్తే తెలుగు దినపత్రిక
1
మహబూబ్‌నగర్
గురువారం | జులై 25, 2024 | www.navatelangana.com

ఘనంగా కేటీఆర్ జన్మదినం



నవతెలంగాణ - బాలానగర్

మాజీ ఐటీ మంత్రి కే తారక రామా రావు జన్మదిన సందర్భంగా బుధవారం హైదరాబాదులో తారక రామారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నేరలపల్లి లింగు నాయక్, రాజాపూర్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్. బాలానగర్ మండల కో ఆప్షన్ సభ్యులు జమీర్ పాషా. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్ నాయక్. వివిధ గ్రామాలకు చెందిన టిఆర్ఎస్ కార్యకర్తలు అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఉద్యోగ మేళా..

మహబూబ్ నగర్ : ఈ నెల 25వ తేదీన (గురువారం) జిల్లా కేంద్రంలో వివిధ ప్రవేటు కంపెనీలలో ఖాళీగా ఉన్న 2610 ఉద్యోగాలకు భారీ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యోగ కల్పన అధికారి మైత్రి ప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి,ఇంటర్ ఆ పై చదువులు చదివిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 18ఏళ్ల నుంచి 35 సంవత్సరాల వయసు లోపు వారు ఆధార్ కార్డు బయోడేటా తో జిల్లా కేంద్రం లోని మల్లికార్జున ఎంటర్ప్రైజెస్ లో జరిగే మేళాకు ఉదయం 10:30గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

మత్స్యశాఖ ఏడీకి సన్మానం



మహబూబ్ నగర్ : మహబూబ్‌నగర్‌కు కొత్తగా వచ్చిన మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చరిత్రను బుధవారం కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు గంజి ఆంజనే యులు అప్పన్నపల్లి యాదగిరి , బోయపల్లి యాదగిరి ఏనుగొండ నరసింహులు మత్స్యకారులకు సంబంధించిన సమస్యలపై చర్చించారు.

డీకే అరుణ రాజీనామా చేయాలి

- కాంగ్రెస్ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో పాలమూరుకు నిధులు కేటాయించకపోవడానికి నైతిక బాధ్యత వహిస్తూ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం రూ.40,000 కోట్లకు పైగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా విస్మరించిందని అన్నారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ ఎంపీగా డీకే అరుణమ్మను గెలిపిస్తే ఒక సైనిక స్కూల్, ఆహార నిల్వ కేంద్రం పత్తి, కంది మార్కెట్ యార్డులు తెస్తారని కరపత్రం వేసి మరీ ప్రచారం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విభజన చట్టంలో ఉన్న ఒక్క అంశాన్ని కూడా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఎంపీలు అనేక సార్లు స్వయంగా ప్రధానమంత్రిని కలిసి వినతి పత్రాలు ఇచ్చిన నిధులు కేటాయించకపోవడం దారుణమని అన్నారు. కేంద్రం నుంచి ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు రూ.250 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సభలలో డీకే అరుణమ్మ నారాయణపేట నియోజకవర్గం నా పుట్టినిల్లని గద్వాల నియోజకవర్గం నా మెట్టినిల్లు అని పదేపదే చెప్పి ఎక్కువ ఓట్లు వేయించుకొని ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వంతో నిధులు తేవడంలో పూర్తిగా విఫలమైనట్లు పేర్కొన్నారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పిస్తామని గతంలో కేంద్రంలోని బీజేపీ పెద్దలు మంత్రులు చెప్పిన ఈ బడ్జెట్ లో కూడా మొండి చేయి చూయించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పొందుపరిచిన కొన్ని అంశాలు కాంగ్రెస్ జాతీయ పార్టీ మేనిఫెస్టోలో ఉన్నాయి కాపీ కొట్టినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడి నిధులు తెస్తే నేను గడియారం చౌరస్తాలో ముక్కు నేలకు రాస్తానని సవాలు విసిరారు. ఈ సమావేశంలో మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు అన్యాయం

- ప్రగతిశీల ప్రజా ఫ్రంట్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణకు తీవ్రంగా అన్యాయం చేసిందని ప్రగతిశీల ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. బుధవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌరస్తా నందు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల ప్రజా ఫ్రంట్ అధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణకు రావాల్సిన న్యాయమైన హక్కుల కోసం వేల మంది విద్యార్థుల బలిదానాల తర్వాత సాధించుకున్న తెలంగాణ ను సాధించుకున్నామని అన్నారు. ముచ్చటగా మూడవసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పాలనలో అన్యాయానికి గురైందని, విభజన హామీల్లో తెలంగాణకు దక్కాల్సిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. కేవలం అధికారం, కుర్చీ కాపాడుకోవడాని, పదవులను కాపాడుకునే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని అన్నారు. తెలంగాణకు తీరని అన్యాయానికి గురి చేయబడ్డదని విభజన హామీల్లో నిలవాల్సిన పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా, బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, ఐఐటి ,నీట్ వంటి ఒక్క హామీని సైతం నెరవేర్చకుండా ఏకపక్షంగా బడ్జెట్ ప్రవేశపెట్టిందని అన్నారు. 8 మంది ఎంపీలను సైతం గెలిపించిన తెలంగాణలో ఇంతక వివక్ష గురికావడం తీరని అన్యాయమని, తెలంగాణ ఎంపీలు ఈ బడ్జెట్ పై స్పందించి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి విభజన చట్టంలో ఉన్న హామీలకు అనుగుణంగా నిధులు కేటాయించాలని కోరారు. లేని పక్షం లో తెలంగాణ వ్యాప్తంగా ప్రజల్లో చైతన్యం కలిగించి పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టి వారిని తెలంగాణలో తిరగనియ్యమని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర నాయకుడు పసులరాజు పాలమూరు లేబర్ సంఘం అధ్యక్షుడు గోపాలకృష్ణ తెలంగాణ విద్యార్థి జేఏసీ నాయకులు బుర్ర సురేష్ ప్రగతిశీల ప్రజా ఫ్రంట్ ఉపాధ్యక్షులు పులిజాల రవి కిరణ్, వెంకట్ రాములు బహుజన సంఘాల నాయకుడు కృష్ణ ,సాయిబాబా ఆనెం శ్రీధర్ వివిధ ప్రజా సంఘాల నాయకులు దినేష్ శ్రీకాంత్ అనుపటిమహేష్, శేఖర్ ఖాదర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు అన్యాయానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీ.డీకే.అరుణలు తక్షణమే రాజీనామా చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి. బాలకిషన్ మాట్లాడుతూ ఎన్నికల ముందు బీజేపీ నేతలు తెలంగాణ రాష్ట్రాం అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని హామీ ఇచ్చి బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మొండిచేయి చూయించారని ఎద్దేవా చేశారు. చీటికిమాటికి తెలంగాణ అమరవీరుల స్మారక స్తూపం దగ్గరికి వెళ్లి రాజకీయ డ్రామాలకు తెరలేపే బండి సంజయ్ , కిషన్ రెడ్డిలు బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణ రాష్ట్రానికి ఉరితాళ్లు బిగుస్తున్న తీరుపై అమరవీరుల స్థూపం దగ్గర ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. పేదరికానికి వలసలకు నిరక్షరాస్యతకు నిలయమైన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అభివృద్ధికి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులకు పెండింగ్ ప్రాజెక్టులకు రైల్వే లైన్ ల విస్తరణ మాటే లేదని వాపోయారు. కేంద్ర ప్రభుత్వ తీరు ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో బీజేపీ సర్కార్ బొందపెట్టే రోజులు దగ్గరలో ఉన్నాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పీ. సురేష్ , కొండపల్లి రాము, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సీ.రాజు, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎన్. శంకర్ నాయక్, చాంద్ భాషా, ఎస్ సంతోష్,సత్యనారాయణరెడ్డి,అబ్దుల్ జబ్బర్, మల్లేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఏకదాటిగా.. ముసురు

- 36 గంటలుగా కురుస్తున్న వర్షం
- సాధారణ వర్షపాతం కంటే అధికం
- ఖరీఫ్ సాగుకు అనుకూల వాతావరణం
- జలాశయాలకు కొనసాగుతున్న వరద



నవతెలంగాణ -
మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో రెండు రోజులుగా ఏకదాటిగా ముసురుతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. సాదారణ వర్షపాతం కంటే అధికంగా కురిసినా... వాగులు, వంకలు, నదులు పొంగి పొర్లే పరిస్థితులు కనపడటం లేదు. ముఖ్యంగా ఖరీఫ్‌కు అనుకూల వాతావరణం నెలకొంది. అయితే ఏకదాటిగా కురుస్తున్న వర్షాల వల్ల అధికారులు అప్ర మతంగా లేకుంట బారీ నష్టం వాటిల్లే అవకాశాలు లేకపోలేదు. ముఖ్యంగా మట్టి మిద్దెలు కూలీ పోవడమేగాక వృద్దులు, పిల్లలు వ్యాధుల బారిన పడుతారని పలు పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో శుక్రవారం సాదారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యింది. అత్యధికంగా తిమ్మాజీపేట మండల పరిధిలో 20 మిమీ వర్షపాతం నమోదయ్యింది. అత్యల్పంగా అమ్రబాద్‌లో 5.4 మిమీ వర్షపాత మాత్రమే నమోదు కావడ విశేషం. సాదారణ వర్షపాతం 8 మిమీ వర్షపాతం కాగా ఉమ్మడి జిల్లాలో 10 మిమీ వర్షపాతం నమోదైంది.

జలాశయాల పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలో శ్రీశైలం, జూరాల, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, బీమాతో పాటు కల్వకుర్తి ఎత్తిపోతల రిజర్వాయర్లు ఉన్నాయి. ముఖ్యంగా వనపర్తి జిల్లాలో సప్త సముద్రాలు ఉన్నాయి. జూరాలకు 7 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ఇంకా వరద వస్తూనే ఉంది. దీంతో రెండు ఎత్తి కిందికి నీటిని వదలారు. ఇక ముసురు వర్షాలతో చెరువులు, కుంటలకు చుక్క నీరు చేరలేదు. నదులు, వాగులు వంకలు పారలేదు. దుందుబీ నది ఇప్పటికే పారాల్సి ఉంది. ఎగువన బాలనగర్, జడ్చర్ల పరిధిలో వర్షాలు లేక నదులు పారడం లేదు. జిల్లాలో ఏనదిలోకి నీరు రాలేదు. జిల్లాలో మట్టి రోడ్లు అస్తవ్యస్థంగా మారాయి. ముసురు వర్షాల వల్ల నీరు భూమిలోకి ఇంకుతోంది. దీంతో భూమి మొత్తం బురద మయంగా మారుతోంది. ఇక బారీ వాహనాల వల్ల బీటీ రోడ్లు సైతం గుంతల మయంగా మారాయి. తాత్కాలిక సహాయక చర్యల విషయంలో కలెక్టర్లు ఇప్పటికే ప్రెస్‌కు సమాచారం విడదల చేశారు. మట్టి మిద్దెలు, పశువులు, వృద్దుల విషయంలో జాగ్రతగా ఉండాలని కోరుతున్నారు. ముసురు వర్షాల వల్ల ఖరీఫ్ సాగుపై కొంత ప్రభావం పడుతోంది. ముఖ్యంగా ఎర్ర, చౌట భూముల్లో వేసిన పత్తి నీరు చిచ్చుతో మురిగిపోతుంది. నల్ల భూముల్లో ఉన్న పత్తి సైతం ఎర్రబారి దిగబడి తగ్గుతోంది. ఆరుతడి పంటలైన మొక్క, పత్తి, కంది వంట పంటలకు నష్టం వాటిల్లుతోంది.

గాలితో కూడిన ముసురుతో విద్యుత్ స్తంభాలు పడిపోయే అవకాశాలు ఉన్నాయి. రోడ్ల వెంట ఉన్న చెట్లు కూలిపోతున్నాయి. భూమి మెత్తగా మారడంతో వేర్లతో సహ చెట్లు పడిపోతున్నాయి. స్థాక తహశీల్దార్‌లు వెంటనే చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. గంటల తరబడి కరెంటు లేకుండా గ్రామాలు అందకారంలో ఉంటున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం స్పందన అంతంత మాత్రంగానే ఉంది. పంచాయితీ కార్యదర్శులు గ్రామాల్లో ఉండటం లేదు. పంచేస్తున్న దగ్గర విధులు నిర్వహించడం లేదు. దీంతో గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు లేక పోవడం మరింత అసౌకర్యానికి గురౌతున్నారు. అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేసినా సామాన్యులకు చేరడం లేదు. ఇప్పటికే పిడుగులు పడి పదుల సంఖ్యలో ప్రజలు వందల సంఖ్యలో మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. అధికారులు స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని పలు పార్టీలు , ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

అప్రమతంగా ఉండాలి..

జిల్లాలో ముసురు వర్షాలు ముదిరే అవకాశాలు ఉన్నాయి. బారీగా వర్షాలు వస్తే.. ప్రజలను రక్షించే బాధ్యత అధికారులే తీసుకోవాలి. ముఖ్యంగా గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. నదులు, వాగులు, వంకలు, రిజర్వాయర్లు నిండితే ప్రమాదాలు చోటుచేసుకోకుండా జాగ్రతలు తీసుకోవాలి .

- వర్థం పర్వతాలు, సీపీఐ(ఎం)
జిల్లా కార్యదర్శి, నాగర్‌కర్నూల్ .

జంతు జనన నియంత్రణ కేంద్రంను సందర్శించిన కలెక్టర్



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

పట్టణంలోని జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ విజయేందిర బోయి సందర్శించారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనన నియంత్రణ కేంద్రంలో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ గురించి మున్సిపల్ కమిషనర్, పశు సంవర్ధక శాఖ అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ 10 వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రోజు 50 వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స నిర్వహించాలని, జంతు జనన నియంత్రణ కేంద్రంలో జడ్చర్ల ,భూత్పూరు మున్సిపాలిటీకి సంబంధించి కూడా జనన నియంత్రణ నిర్వహించాలని పేర్కొన్నారు. జంతు జనన నియంత్రణ కేంద్రం మరింత విస్తరించాలని సూచించారు. అనంతరం రామయ్య బొలిలో వరద నీరు ద్వారా గతం లో ముంపునకు గురయ్యే ప్రాంతాన్ని సందర్శించారు. మర్లు దగ్గర వరద నీరు కాల్వ నుంచి శివశక్తి నగర్ పక్కన కాల్వకు వరద నీరు డైవర్ట్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్రయిన్ అంచున ఉన్న సక్సెస్ స్కూల్ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నందున స్కూల్ యాజమాన్యంను అప్రమత్తం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, పశు సంవర్ధక శాఖ జే.డీ. మధుసూదన్ ,మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, పశు సంవర్ధక శాఖ ఏ.డీ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

బడ్జెట్‌లో బీసీలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

- బీసీసేన రాష్ట్రఅధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్



నవతెలంగాణ - జడ్చర్ల

బడ్జెట్ కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం బీసీలను విస్మరించిందని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ అన్నారు. జడ్చర్ల మండల కేంద్రంలోని బీసీ సేన కార్యాలయంలో బీసీ సేన నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 48 లక్షల 21 వేలకోట్ల బడ్జెట్ లో బీసీలకు కేవలం రూ.2200 కోట్ల కేటాయించిందని, దేశంలో ఉన్న 70 కోట్ల మంది బీసీలకు ఒకపూట భోజనానికి కూడా సరిపోదని, ఒక ప్రణాళిక ప్రకారమే బిజేపీ బీసీలను విస్మరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఓట్ల కోసం ఆరాటపడడం తప్పా బీసీల సంక్షేమం కోసం పాటుపడని బీజేపీకి రా బోవు స్థానిక సంస్థల ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని, బీసీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎంపీ రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాలతో కలిసి పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి, చట్టసభలలో బీసీలకు 60 శాతం రిజర్వేషన్లు, బీసీ కులగణన, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసేలా కేం ద్రంపై ఒత్తిడి తేవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం లోని వెనకబడిన జిల్లాలతో పాటు పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి, బడ్జెట్ కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ప్రవేశపెట్టబోయే బడ్జెట్లో బీసీలకు రూ. 50 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, బీసీ డిక్లరేషన్ అమలుకు చర్యలు తీసుకోవాలని , ఇచ్చిన హామీ మేరకు.. బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి, అదనంగా రూ.20 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాచారం, శ్రీనివాస్, కట్టమురళి, వెంకటేష్, రాములు, ఆంజనేయులు, రమణ, నరేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- మిల్లీమహాజ్ మహబూబ్ నగర్ కన్వీనర్ తఖీ హుస్సేన్



మహబూబ్ నగర్ : తదివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో మైనార్టీల కోసం స్కాలర్షిప్, ఫీజురీయిం బర్స్‌మెంట్ ఏర్పాటు చేసి లక్షలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని మిల్లీమహాజ్ మహబూబ్‌నగర్ కన్వీనర్ తఖీ హుస్సేన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ యన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో మైనార్టీల విద్యార్థుల ఫీజురీ యింబర్స్ మెం ట్, స్కాలర్షిప్ లు విడుదల చేయలేదని, దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించు కుంద న్నారు. అధికా రంలోకి వచ్చిన వెంటనే విడుదల చేస్తా మని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలు గడి చినా ఇప్పటి వరకు తన హామీని నిలబె ట్టుకో లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాల ర్షిప్‌లు విడుదల కాకపోవడంతో ఉన్నత చదువుల కోసం వెళ్లే మైనార్టీ విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబ ర్స్‌మెంట్, స్కాలర్షిప్ పెండింగ్ బిల్లులు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో చాలా కళాశాలల యాజ మాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో ఉన్నత చదువుల్లో అడ్మిషన్లు పొందలేక పోతున్నట్లు తెలిపారు.పెండింగ్‌లో ఉన్న కళాశాలల యజా మాన్యాల బిల్లులు చెల్లించాలని లేదా ఆయా ఉన్నత చదువుల్లో అడ్మిషన్లు తీసుకునేలా ప్రభుత్వం జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను సీఎం రేవంత్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు. మైనార్టీ విద్యార్థుల సమస్య పరిష్కారం కోసం త్వరలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. చీఫ్ ప్యాట్రన్ అన్వర్ పాషా మాట్లాడుతూ మైనార్టీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. మైనార్టీ విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కో కన్వీనర్లు మిర్జా ఖుద్దూస్ బేగ్, హాఫిజ్ ఇద్రీస్, నూరుల్ తదితరులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో సంగమేశ్వర ఆలయం

- జూరాల నుంచి 42 గేట్ల ద్వారా లక్షా యాభై వేల క్యూసెక్కుల నీటి విడుదల
- జూరాల బీచ్ పెల్లి బీచుపల్లి దగ్గర మునుగుతున్న స్నాన ఘాట్‌లు
- ఆనంద ఉత్సాహాలతో సందర్శకులు





నవ తెలంగాణ -
మహ బూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి

మహబూబ్బగర్ జిల్లా మల్లేశ్వరం గ్రామ సమీపాన కృష్ణా నదలో ఉన్న సంగమేశ్వర ఆలయాన్ని నీరు చుట్టుముట్టింది. రోజుకు 1.50 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల కావడంతో నది పరివాహక ప్రాంతంలో ఉన్న స్నాన ఘట్టాలు మునిగిపోతున్నాయి. సమీపాన సమీపాన మత్స్య కార్మికుల ఆవాసాలను అధికారులు ఖాళీ చేయించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. జూరాల నుంచి 42 గేట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి ద్వారా లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మరో రెండు రోజులు ఇలాగే వరద ఉధృతి ఉంటే గేట్లు ఎత్తివేసే అవకాశాలు ఉన్నాయి. అత్యధికంగా జూరాల నుంచి 43 గేట్ల ద్వారా 1,60,000 క్యూసెక్కులన్నిటిని కిందికి వదులుతున్నారు. పవర్ హౌస్ తో కలిపి 1,81,000 600 మూడు క్యూసెక్కుల నీటిని వదలడంతో శ్రీశైలం వైపు వరద పరుగు పెడుతుంది. నెట్టెంపాడు రిజర్వాయర్‌కు 500 బీమాకు 1300 ఎడమ కాలువ ద్వారా 820 కుడికాలు ద్వారా 584 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇంకా మూడు రోజులు వర్షాలు ఉన్నాయని సమాచారం రావడం రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎగువ కర్ణాటక మహారాష్ట్రల నుంచి వరదలు ఉధృతంగా కొనసాగుతున్నాయి. ఆల్మట్టి నారాయణపూర్ రిజర్వాయర్లు నిండి నీటిని కిందికి వదులుతుండడంతో దిగువన ఉన్న రిజర్వాయర్లు చెరువులను నింపడానికి జిల్లా యంత్రాంగం అప్రమత్తమయింది. ఇప్పటికే కల్వకుర్తి తిప్పతల పథకం ద్వారా రెండు మోటార్ల ద్వారా నీటిని కాలువలకు వదిలేందుకు బుధవారం రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల సమీపంలో సప్తనదుల ప్రదేశంలో కొలువైన అతిపురాతన సంగమేశ్వరాలయాన్ని మంగళవారం మధ్యాహ్నం కృష్ణా నది జలాలు చుట్టూ ముట్టాయి. దీంతో ఆలయంలో ఎంతో విశిష్టమైన వేపధారు శివలింగానికి నడుము లోతు నీళ్ళలోకి ఆలయ ప్రధాన అర్చకులు తెలకపల్లి రఘు రామశర్మ హరతినిచ్చారు. అలాగే నది జలాలకు సైతం ఆయన పూజలు చేశారు. ఎగువన కర్ణాటకలో భారీ వర్షాల కారణంగా కృష్ణానదికి ఉప్పెనలా వరద ప్రవాహం శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతుంది. శ్రీశైలం డ్యాంలో 840 అడుగులకువరద జలాలు చేరడంతో సంగమేశ్వరాలయంలోని శివలింగాలు జలధి వాసమయ్యాయనీ ఆలయ ప్రధాన పురోహితుడు రఘురామ శర్మ తెలిపారు. ప్రతి ఏటా ఫిబ్రవరి నెలలో నది జలాల నుంచి ఆలయం బయటపడి ఆరు నెలల పాటు రెండు తెలుగు రాష్ట్రాల భక్తుల చేత నిత్య పూజలందుకోవడం ఆనవాయితీ.అయితే ఈమారు డిసెంబర్ నెల నుంచే నది జలాలు (రెండు నెలలు ముందుగానే)వెనుకకు వెళ్లాయి. దీంతో మరో ఆరు నెలలు పాటు జల సమాధి అయ్యారు. బీచుపల్లి దగ్గర హనుమాన్ దేవాలయానికి సమీపానికి నీళ్లు వస్తున్నాయి. ఒక్కో మెట్టు పైకి నీళ్లు వస్తున్నాడంతో జాగ్రత్తలు తీసుకోవాలని భక్తులను పూజారులను అధికారులు సూచనలు చేస్తున్నారు. బీచుపల్లి సోమశిల పాతాళగంగ వంటి ప్రాంతాలలో సందర్శకుల సందడి పెరిగింది. దేవాలయాలు మాన ఘట్టాలు ఒక్కొక్కటి కృష్ణా నదిలో జల సమాధి అవుతున్నాయి.

మా హయాంలోనే బ్రిడ్జీల నిర్మాణం: మాజీ మంత్రి



నవతెలంగాణ- వనపర్తి

మెరుగైన రవాణా సౌకర్యం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే బ్రిడ్జీల నిర్మాణం చేపట్టామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన చిమనగుంటపల్లి - అంకూరు మధ్య నిర్మాణంలో ఉన్న హైలెవల్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చాకే జిల్లాలో సాగునీరు అందుబాటులోకి వచ్చిందన్నారు. వనపర్తి నియోజకవర్గంలో రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకు అనేక హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించామని గుర్తు చేశారు. అందులో కొన్ని పూర్తయ్యాయని, మరి కొన్ని నిర్మాణాల్లో ఉన్నాయని వాటి పనులను కాంట్రాక్టర్లు వేగవంతం చేయాలని అందుకు అధికారులు సహకరించాలన్నారు. ఆయన వెంట నాయకులు బాలీశ్వర్ రెడ్డి, పురేందర్, చిట్యాల రాము తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు ఘనసన్మానం



నవతెలంగాణ- పెబ్బేరు

రాష్ట్రస్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి బుధవారం వనపర్తి జిల్లాకేంద్రానికి వచ్చిన శివసేనారెడ్డిని పెబ్బేరు ఉమ్మడి మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యాపర్తిగా పేరుగాంచిన వనపర్తి నియోజకవర్గాన్ని క్రీడాపర్తిగా అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అక్కి శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ సాగర్, రంజిత్ కుమార్, సురేందర్ గౌడ్, శ్రీరంగాపురం మండల నాయకులు బీరం రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త రుణాల సమస్యను పరిష్కరించండి

• లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే



బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్న అధికారులు

నవతెలంగాణ-వనపర్తి

రుణమాఫీ తర్వాత కొత్త రుణాల పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని లీడ్‌బ్యాంక్ డిస్టిక్ మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే బ్యాంక్ మేనేజర్లను ఆదేశించారు. బుధవారం వనపర్తి, కొత్తకోట ఎంపీడీవో కార్యాలయాల్లో జాయింట్ మండల్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ నిర్వహించి, పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కౌశల్ కిషోర్ పాండే మాట్లాడుతూ మొదటి దశ పంట రుణాలు చెల్లించిన తర్వాత కిసాన్ క్రెడిట్ కార్డ్ పునరుద్ధరణ, కొత్త రుణ పెండింగ్‌లను పరిష్కరించాలని అన్ని బ్యాంకులను ఆదేశించారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద డిటిఎమ్, నాబార్డ్ సూచనల మేరకు రైతుల రుణాన్ని, వ్యవసాయ మౌలిక సదుపాయాల రుణాలను పెంచాలన్నా రు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వం మహిళా శక్తి పథకం కింద వనపర్తి లో 200 యూనిట్ల లక్ష్యాలను కేటాయించినందున, ఎస్‌హెచ్‌జి, పిఎంఎఫ్ఎంఈ పథకం కింద రుణాలను పెంచాలని అదనపు డీఆర్‌డీవో బ్యాంకర్లకు సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఎస్ హెచ్ జీలకు రూ.320 కోట్లను బ్యాంకు లింకేజ్ ద్వారా అందించాలని లక్ష్యాన్ని కమిటీ నిర్దేశించిందని ఎల్‌డిఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లు, అడిషనల్ డిఆర్‌డిఓ, నాబార్డ్ డీడీఎం, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్, మెప్మా అధికారులు, అన్ని బ్యాంకుల మేనేజర్లు, ఏపీఎం ,సీసీలు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

• తహసీల్దార్ షేక్ చాంద్‌పాషా



రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

నవతెలంగాణ-అమరచింత

రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ షేక్ చాంద్‌పాషా రేషన్ డీలర్లను హెచ్చరించారు. బుధవారం అమరచింత తహసీల్దార్ కార్యాలయంలో చౌకధర దుకాణదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లు అక్రమంగా బియ్యం దందా చేస్తున్న వారికి చౌకధర దుకాణాల నుంచి ముందే బియ్యం సరఫరా అవుతున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నా యన్నా రు. బియ్యాన్ని వినియోగదారులకే విక్రయించాలని ఆదేశించారు. అక్రమ బియ్యం దందా చేసే వారికి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటయ్య, రేషన్ డీలర్లు కృష్ణయ్య గౌడ్, శాంతన్న, విష్ణువర్ధన్‌రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు మాజీ మంత్రి పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణ -వనపర్తి రూరల్

రేవల్లి మండలానికి చెందిన బీరం కృష్ణారెడ్డి భార్య కృష్ణమ్మ ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బుధవారం బాధితురాలిని పరామర్శించారు. అనంతరం బిజినపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పబ్బతి పర్వతాలును పరామర్శించారు. ఆయన వెంట శివరాం రెడ్డి, ఖాజా, అబ్బాస్, అంకురి కృష్ణయ్య, నారంరెడ్డి, మల్లేష్ దాసరి బంగారయ్య, ముష్టి నిరంజన్, జబ్బు నిరంజన్, గడ్డల నిరంజన్, నాగిరెడ్డి , భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతి గ్రామంలో కమిటీలు వేయాలి

• ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ లక్ష్మణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ- వనపర్తి రూరల్

జిల్లాలోని ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల కమిటీలు వేయాలని ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ లక్ష్మణ్ అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ అజ్జపాగ లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమన్వయకర్త గంధం గట్టయ్య, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, అనుబంధ సంఘాలు సంస్థ గత నిర్మాణం ప్రతి గ్రామాన చేపట్టాలని అదేవిధంగా జెండా గద్దెలు గ్రామ గ్రామాన నిర్మించి జెండా ఆవిష్కరణలు చేయాలన్నారు. వర్గీ కరణపై వచ్చే నెల సుప్రీం కోర్టు తీర్పు వచ్చే అవకాశం ఉందన్నారు. కావున ప్రతి నాయకుడు గ్రామ గ్రామాన కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు సీనియర్ నాయకులు అజ్జపాగ మాసన్న ,శ్యామ్, దండు శీను ఆత్మకూరు మండల అధ్యక్షులు సిరివాటి శ్రీనివాసులు, ఎస్సి ఉపకులల రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రామకృష్ణ, బేడ బుడగ జంగం రాష్ట్ర కార్యదర్శి మొలకలపల్లి పరశు రాముడు, వివిహెచ్‌పిఎస్ జిల్లా నాయకులు బండారి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమించాలి

• కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయాలి
• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జబ్బార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎండి.జబ్బార్

నవతెలంగాణ- పాన్‌గల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ. జబ్బార్ కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. బుధవారం పాన్‌గల్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎండీ జబ్బార్, సీపీఎం మండల కార్యదర్శి ఎం బాల్యనాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు మర్చిపోయాయన్నారు. ఆయా ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి వ్యక్తిగత రాజకీయాల వైపు పోతున్నాయని విమర్శించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు అన్ని రంగాల్లో సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ గందరగోళంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణకు ఏమీ ఇవ్వలేదన్నారు. రెండు ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై వనపర్తి జిల్లా లో 29న సీపీఐ(ఎం) విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ప్రజాసంఘాలు, పార్టీ కార్యకర్తలు ఆగస్టు1 నుంచి 20వ తేదీ వరకు వనపర్తి జిల్లాలోని అన్ని గ్రామాలకు వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమ స్యలపై సర్వే నిర్వహించి నివేదిక తయారుచేసి సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం మండల నాయకులు సూర్యవంశం రాము, కే.వెంకటయ్య ఎం.వెంకటయ్య, భగత్, జములయ్య, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

మద్యం, బెల్టు షాపులను నియంత్రించాలి

• ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి

నవతెలంగాణ-వనపర్తి

రాష్ట్ర ప్రభుత్వం మద్యం, బెల్టు షాపులను నియంత్రించాలని, పోర్న్ వెబ్‌సైట్లను తొలగించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ.లక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 9వ వార్డు లక్ష్మీనర్సింహ కాలనీలో బుధవారం ఐద్వా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతి థిగా హాజరై మాట్లాడుతూ ఐద్వా ఆధ్వర్యంలో రేమద్దుల గ్రామంలో మహిళా పొదుపులో జరిగిన అవినీతిని వెలికి తీసి రూ.7 లక్షలు రికవరీ చేయించామన్నారు. వనపర్తిలోని ఓప్రైవేట్ హాస్పిటల్‌లో వైద్యుల నిర్లక్ష్యం వల్ల మృతి చెందిన చనిపోయిన గర్భిణీ కుటుంబానికి ఆర్థిక భరోసా ఇచ్చేందుకు సంఘం ఆధ్వర్యంలో వారితో మాట్లాడి రూ.15 లక్షల పరిహారం ఇప్పించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి మహిళకు రూ.2500 నగదు, రూ.500కి గ్యాస్ సిలిండర్ ఇవ్వాల ని, సామాజిక పింఛన్లు రెంటిపు చేయాలని డిమాండ్ చేశారు. కాలనీలో డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిష్క రించాలని కోరారు. సినిమా, సీరియల్లో మహిళల ను ఆటవస్తువుగా చూపించే సాంస్కృతికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. ఆగస్టు 4వ తేదీన వనపర్తిలో ఐద్వా జిల్లా 3వ మహాసభలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. మహాసభలో భవిష్యత్ కార్యా చరణ గురించి చర్చించనునట్లు తెలిపారు. ఈ మహాసభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవం తం చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రమీజా బేగం కార్య దర్శిగా కమల, కమిటీ సభ్యులుగా కాశమ్మ, జ్యోతి, వెంకటమ్మ సుశీల తదితరులను ఎన్నుకున్నారు.



వనపర్తిలో మహాసభల కరపత్రాలు విడుదల చేస్తున్న సభ్యులు

హక్కుల కోసం ఉద్యమించాలి

పాన్‌గల్ : మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రతి మహిళ ఉద్యమించాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి సాయిలీల పిలుపు నిచ్చారు. బుధవారం పాన్‌గల్ మండల కేంద్రంలో నిర్వహించిన ఐక్య మహిళా సంఘం సమావేశానికి ఆమె హాజరై మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మహిళల హక్కులను కాల రాస్తున్నాయన్నారు. బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్య మహిళా సంఘం జిల్లా నాయకురాలు చిట్టెమ్మ, అనిత, లక్ష్మి, భారతి శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో కరపత్రాలు విడుదల చేస్తున్న ఐద్వా సభ్యులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

• ఆత్మకూరు ఎస్సై నరేందర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నరేందర్

నవతెలంగాణ- ఆత్మకూరు

సైబర్ నేరలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నరేందర్ విద్యార్థులకు సూచించారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నరేందర్ విద్యార్థులకు సైబర్ నేరాలు అంటే ఏమిటి, వాటివల్ల ఎలా అప్రమత్తంగా ఉండాలనేదానిపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌ద్వారా మభ్యపెట్టి డబ్బు దోచుకుంటారన్నారు. ముఖ్యంగా ఫోన్ ద్వారా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని మీ ఖాతా వివరాలు చేపమంటే చెప్పొదని, మరి కొందరు వాట్స్‌ఆప్‌లో నకిలీ వెబ్‌సైట్ ద్వారా లింకులు పంపుతారని, మరికొందరికి మీ ఫోన్ నెంబర్‌కు లాటరీ తగిలిందని, లింకులు పంపుతారని వాటిని ఓపెన్ చేయొద్దన్నారు. ఓపెన్ చేస్తే మీ వివరాలన్నీ సైబర్ నేరగాళ్లకు వెళ్లిపోతాయని దీంతో వారు మీ ఖాతాల్లోని డబ్బును దోచుకుంటారన్నారు. సైబర్ నేరాలపై మీ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రోషన్న, భానుచందర్, మురళీధర్ గౌడ్, కళాశాల సిబ్బంది విశ్వేశ్వర్, తిరుమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఆత్మకూరు పట్టణంలో బుధవారం సాయంత్రం ఎస్సై నరేందర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భం గా నెంబర్ ప్లేట్లు, సరియైన ధ్రువపత్రాలు లేని 20 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. తాగి వాహనాలు నడుపొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలోని పురాతన కబ్రస్థాన్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ముస్లిం స్మశాన వాటిక పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తాసిల్దార్ , మున్సిపల్ కమిషనర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మైనార్టీల మనోభావాలు దెబ్బ తినకుండా కబ్రస్థాన్ పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మాకు సరైన న్యాయం జరగకపోతే జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే కోర్టుకు వెళ్తా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం స్మశాన వాటిక పరిరక్షణ కమిటీ చైర్మన్ గయోసుద్దీన్, అబ్దుల్ వహీద్, ఇమ్రాన్, సాహిబ్ ,ముజాహిద్, షబ్బీర్, హమ్మద్ హుస్సేన్, నిరంజన్ ,ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

నవయుగ కవిచక్రవర్తి జాషువా

• ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నవతెలంగాణ- వనపర్తి

కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత గుర్రం జాషువా నవయుగ కవి చక్రవర్తి అని ప్రజావాగ్గేయ కారుడు రాజారాం ప్రకాష్ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో బుధవారం టీజేఎస్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కవులు, కళాకారులు , ప్రజా సంఘాల నాయకులు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారాం ప్రకాష్ మాట్లాడుతూ సమాజం పట్ల పూర్తి అవగాహనతో ప్రజా సమస్యల దిక్కారస్వరమై జాషువా గర్జించారని గుర్తు చేశారు. ఆయన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై తిరగబడ్డాడని, ఛీత్కారాలు ఎదురైన చోటే జాషువా సత్కారాలు పొందాడన్నారు. ఈ కార్యక్రమంలో కవి పండితుడు బూరోజు గిరిరాజాచారి, కవి,వ్యాఖ్యాత డాక్టర్ నాయకంటి నరసింహ శర్మ, బోయ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకుడు కావలి బాలస్వామి నాయుడు, ముస్లిం మైనార్టీ జిల్లా నాయకుడు బాలేమియా, జానపద గాయకుడు మల్లెపు నరసింహ, జిల్లా ఎస్సీ, ఎస్టి మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు రాధాకృష్ణ, పీఆర్‌టీయూ నాయకుడు రంగస్వామి, యూటీఎఫ్ నాయకుడు వెంకటేష్, డీఎస్పీ నాయకుడు వెంకటస్వామి, డిటిఎఫ్ నాయకుడు నరసింహ, వాల్మీకి సంఘం నాయకుడు విష్ణు నాయుడు, ఎమ్మార్పీఎస్ నాయకులు బిచుపల్లి, శివశంకర్ వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం :సీపీఐ



బడ్జెట్ పత్రులను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

నవతెలంగాణ- వనపర్తి రూరల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని సీపీఐ నాయకులు విమర్శించారు. బుధవారం సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద బడ్జెట్ పత్రులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీహరి మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తమ పదవులకు రాజీనామా చేయాలని, బడ్జెట్ ను సవరించి విభజన హామీల అమలుకు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు నిధులను కేటాయించకుండా నరేంద్ర మోడీ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని బీహార్ రాష్ట్రానికి 26 వేల కోట్లు, ఆంధ్రప్రదేశ్ కు ఒక్క పోలవరం ప్రాజెక్టుకే 15 వేల కోట్లు కేటాయించిందని, తెలంగాణకు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు మొండి చేయి చూపించారని వారన్నారు. తెలంగాణ ప్రజలు ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపించారని మద్దతుతోనే నరేంద్ర మోడీ అధికారంలో ఉన్నారని నిధుల కేటాయింపులో వివక్ష చూపి తెలంగాణ ప్రజల నమ్మకంపై దెబ్బ కొట్టారన్నారు. బిజెపి ఎంపీలు ఈ వివక్షకు నిరసనగా గలం ఎత్తాలని వారన్నారు. బడ్జెట్‌ను సవరించకుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాన్ని ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, భారత జాతీయ మహిళా సమాఖ్య ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు పి.కలవతమ్మ, ఏఐవైఎఫ్ మహిళా సమాఖ్య వ్యవసాయ, కార్మిక సంఘం, ఏఐటీయూసీ నాయకులు రాజనగరం కృష్ణయ్య, ఎత్తం మహేష్, బోలెమోని నాగన్న, రాములు, చిలక కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



వనపర్తిలో...

నవతెలంగాణ- వనపర్తి

వనపర్తి పట్టణంలో బుధవారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్‌తో కలిసి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ బి.లక్ష్మయ్య, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, ప్రధాన కార్యదర్శి పరంజ్యోతి, కౌన్సిలర్ బండారు కృష్ణ, నాయకులు ఉంగ్లం తిరుమల్, నీలస్వామి, సూర్యవంశపు గిరి, స్టార్ రహీమ్, సునీల్ వాల్మీకి, దేవర్ల నర్సింహ, యుగంధర్‌రెడ్డి, నందిమల్ల రమేష్, మురళీసాగర్, తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరులో..

పెబ్బేరు: పురపాలక కేంద్రంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వల్లపురెడ్డి దిలీప్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసు పత్రిలో కేక్‌కట్ చేసి రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ సాయినాథ్, వైస్ చైర్మ న్ కర్రెస్వామి, కౌన్సిలర్ చిన్న ఎల్లారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు యాదవ్, నాయకులు పెద్దింటి వెంకటేష్, పున్న విశ్వరూపం, గొడుగు శాంతన్న, వెంకటయ్య గౌడ్, మేకల ఎల్లయ్య, శేఖర్ గౌడ్, వేణుగోపాల్, శ్రీధర్ రెడ్డి, వసంతరావు శ్రీనివాసులు, బీసన్న, ఆస్పత్రి సిబ్బంది, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అత్మకూర్‌లో..

ఆత్మకూరు: పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గాంధీ చౌక్‌లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి యాదవ్, మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, నాయకులు మొగిలి శ్రీధర్‌గౌడ్, కౌన్సిలర్లు రామకృష్ణ, రాజ్‌కుమార్, విరేషలింగం తదితరులు పాల్గొన్నారు.

అమరచింతలో..

అమరచింత: మాజీ జెడ్పీటీసీ రాజేందర్ సింగ్ నివాసంలో బీఆర్ఎస్ శ్రేణులు కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఎస్. రాజు, కౌన్సిలర్ రాజ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యులు షానవాజ్ ఖాన్, నాయకులు జింక రవి, షంషేర్, పురుషోత్తం, కోరి శ్రీనివాసులు, జగన్నాథం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో..



పెబ్బేరులో..



అమరచింతలో..

సమస్యలపై పంచాయతీ కార్యదర్శికి వినతి



నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్
మండల పరిధిలోని యన్మన్‌బెట్ల గ్రామంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలపై బుధవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అధ్యాయనం చేసి గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బి.శివవర్మ, యన్మన్‌బెట్ల గ్రామ కార్యదర్శి జల్లాపురం సురేం దర్ మాట్లాడుతూ గ్రామంలో గత ఎన్నో ఏళ్లుగా వీరమ నాయిని చెరువుకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాబట్టి ఆ చెరువు కు తక్షణమే సాగునీరందించి ఆ చెరువు కింద ఉన్న సుమారు 200 ఎకరాల పైచిలుకు సాగు భూములకు చివరి ఆయకట్టు వరకు నిరందించాలని ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎండి.సలీం, కేశగౌని వెంకటేష్ గౌడ్, బేవిని చంద్రయ్య, సాయికుమార్, కిరణ్ రావు, రమేష్, వెంకట స్వామి, బాలస్వామి పాల్గొన్నారు.

మంచినీటి చేతి పంపు మరమ్మతు



నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్
మున్సిపాలిటి పరిధిలోని 5వ వార్డులో ప్రజలకు, పోశమ్మ గుడికి వచ్చే భక్తులకు నీటి ఇబ్బందులు లేకుండా మంచి నీటి చేతి పంపును వైస్ చైర్మన్ మహా ముదా బేగం ఖాదర్ పాషా మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో ప్రజలందరికీ మిషన్ భగీరథ నీళ్లు వచ్చేలా చర్యలు తీసుకుంటా మన్నారు. అలాగే ప్రజలకు పారిశుద్ధ్యం, వీధి దీపాలు ఇబ్బందులు కలగకుండా, అంటు వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శాంతమ్మ, మున్సిపల్ బోరింగ్ మెకానిక్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-పెంట్లవెల్లి
మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల సీనియర్ నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పోతుల వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ చిట్టెమ్మ సురేందర్ గౌడ్, మాజీ ఎంపీపీ ఉమామహేశ్వరి రాజేష్ మాట్లాడుతూ మాజీ ఐటీ మంత్రిగా తెలంగాణకు తన సేవలు అందించి తెలంగాణను ప్రపంచ దేశాలతో పోటీగా అభివృద్ధి పరిచారన్నారు. అంతేకాకుండా తెలంగాణ సాధనలో ముఖ్య పాత్ర పోషించి నిరంతరం రాష్ట్ర అభివృద్ధికై ఆయన పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో బాలస్వామి, బ్రహ్మయ్య, వెంకట నరసింహ, జటప్రోలు మాజీ సర్పంచ్ ఖాజా మైనద్దీన్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దళితవాడల్లో జలమయంగా మారిన రోడ్లు



నవతెలంగాణ-వంగూరు
మండల కేంద్రంలో దళితవాడలో రోడ్లు జలమయంగా మారాయని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బాలస్వామి, సీఐటీయూ మండల కార్యదర్శి శివరాములు అన్నారు. బుధవారం వారు కాలనీ వాసులతో కలిసి జలమయంగా మారిన రోడ్లపై వరినాట్లు వేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితవాడలో ఎటు చూసినా మట్టి రోడ్లు ఉండడంతో వర్షపు నీరు రోడ్లపైకి వచ్చి గుంతల మయంగామారి కాలనీవాసులు రాకపోకలకు అంతరాయం కలిగిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారు లు పట్టించుకొని రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రుక్కమ్మ, రాములమ్మ వెంకటమ్మ, పోచయ్య, రాకేష్, వెంకట య్య, సైదులు, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సైబర్ నేరస్తుల వలలో పడొద్దు

- కాంగ్రెస్ నాయకులు నేరాలపల్లి మనోహర్



నవతెలంగాణ - తిమ్మాజిపేట
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుల కోసం తీసుకువచ్చిన రుణమాఫీని ఆస రాగా చేసుకుని సైబర్ నేరస్తులు బ్యాంకుల పేరుతో వాట్సాప్‌లో బ్యాంకు లోగోలతో బ్లూ కలర్‌లో కొన్ని మోస పూరితమైన లింకులు పంపి మోసాలకు పాల్పడు తున్నారు. అటువంటి వాటి పట్ల జాగ్రత్త వహించాలని కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు నేరాలపల్లి మనోహర్ మండల రైతులకు సూచించారు. ఎవరై నా కొత్త వ్యక్తులు వాట్సాప్‌లో లింకులు పంపిస్తే వాటిని క్లిక్ చేయకూడదని లింకులు డౌన్‌లోడ్ చేసుకోకూడదని తెలిపారు. కొత్త వ్యక్తులు రాంగ్ కాల్స్ చేసి అకౌంట్‌లో డబ్బులు వేస్తామని, డబ్బులు వచ్చాయని మాయ మాటలు చెప్పి మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలి. సైబర్ నేరస్తుల చేతుల్లో డబ్బులు పోగొటుకోవడం ఎంత సులభమో పోయిన డబ్బులు వెనక్కి తెచ్చుకోవడం చాలా కష్టం. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

జైపాల్ రెడ్డి విగ్రహ ఏర్పాట్లు పరిశీలన



నవతెలంగాణ-వెల్దండ
మండల పరిధిలోని కొట్ర ఎక్స్ రోడ్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి విగ్రహ ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌లు బుధవారం పరిశీలించారు. ఈనెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరిస్తున్న నేపథ్యంలో ఆవిష్కరణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వ హించాలని పోలీసులను ఆదేశించారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి నుండి వాహనాలను మళ్లించి కల్వకుర్తి మీదుగా వాహనాలు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కొట్ర చౌరస్తాలో విగ్రహావిష్కరణ అనంతరం గుర్తు పట్టణం లోని మునిసిపల్ కార్యాలయం సమీపంలో బహిరంగ సభ ఏర్పాటు చేయను న్నట్లు వారు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గ ప్రాంత జైపాల్ రెడ్డి అభిమా నులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్ర మంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు సంజీవ్ యాదవ్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, మండల అధ్యక్షులు మోతిలాల్ నాయక్, పర్వత్ రెడ్డి, వెంకటయ్య గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- జిల్లా కమిటీ సభ్యులు గోపాస్ లక్ష్మణ్
- తెలకపల్లిలో భిక్షాటన చేస్తున్న కార్మికులు



నవతెలంగాణ -తెలకపల్లి
గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ సభ్యులు గోపాస్ లక్ష్మణ్ అన్నారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎండి.సైదులు, ఎం.లింగస్వామి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గోపాస్ లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 56వేల మంది గ్రామపంచాయతీ కార్మికులు ప్రజా శ్రేయస్సు కోసమై ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా ఆరోగ్యాలను కాపాడుతున్నటువంటి గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. వేతనాలు ఇవ్వకపోతే 11నెలలుగా వారి కుటుంబాలు ఎలా బ్రతకాలని ఆయన ప్రశ్నించారు. సఫాయి కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేమన్నారు. సంవత్సరం కాలంగా వేతనాలు అందక నిత్యావసర సరుకుల కోసం చేసిన అప్పులు తీర్చలేక రాష్ట్రంలో ఇటీవల కార్మికులు ఆత్మహత్యచేసుకున్నరని అవన్నీ కూడా ప్రభుత్వ హత్యలేనని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వెంటనే పెండింగ్ వేతనాల బడ్జెట్ రిలీజ్ చేశామని చెప్తున్న గవర్నమెంట్ ఎందుకు కార్మికుల ఖాతాల్లో వెయ్యలేదని ప్రశ్నించారు. కార్మిక పెండింగ్ డబ్బులు చెల్లించకపోతే ఈనెల 30న అసెంబ్లీ ముట్టడి చేపడతామని ఈ సందర్భంగా ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు మైసమ్మ యాదమ్మ లక్ష్మయ్య బాలయ్య రాజు నాగయ్య రాములు బాలరాజు ఎల్లయ్య మల్లయ్య వెంకటయ్య పాల్గొన్నారు.

కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రి సందర్శన



నవతెలంగాణ-కల్వకుర్తి టౌన్
పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని రాష్ట్ర కాయకల్ప బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో నెలకొన్న పారిశుధ్య నిర్వ హణ పనులను వారు పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలోని అన్ని వార్డులలో తిరిగి రోగులకు అందుతున్న సేవలు, పారిశుధ్య నిర్వహణ పనులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆస్పత్రిలో విభాగాలుగా ఉన్న గదులను పరిశీలించి రోగులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఆపరేషన్ థియేటర్ తదితర వార్డులలో తిరిగి నెలకొన్న పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ శివరాంతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాయకల్ప బృందం సభ్యులు డాక్టర్ యాదయ్య, శ్రీమతి శైలజ, విజయలక్ష్మి తదితర బృందం సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ఆస్పత్రి సిబ్బంది కృషి చేయాలని కోరారు. పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు యశోద భాయ్, స్వర్ణలత, విష్ణు, అన్నపూర్ణ, పాండురంగ, షకీల్ తదితరులున్నారు.

ప్రజల ప్రాణాలు తీయడానికే..

మూడు లైన్ల రహదారి నిర్మాణం

- కల్వకుర్తి-నంద్యాల రహదారి నిర్మాణంపై విమర్శలు
- రోడ్డు మధ్యలో డివైడర్ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం

నవతెలంగాణ-కల్వకుర్తి
కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కల్వకుర్తి నంద్యాల జాతీయ రహదారి నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. అయితే నాలుగు లైన్ల రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మూడు లైన్ల రహదారి మాత్రమే నిర్మిస్తుంది. ప్రజల ప్రాణాలను హరించడానికే మూడు లైన్ల రహదారి నిర్మాణం చేపడుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు దాదాపు 800 కోట్లతో కేంద్ర ప్రభుత్వం మూడు లైన్ల రహదారి నిర్మాణానికి టెండర్లు పిలిచింది. గత రెండు సంవత్సరాలుగా ఈ పనులు కొనసాగుతున్నాయి. అయితే ఈ రహదారి నిర్మాణం మూడు లైన్లు మాత్రమే ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కల్వకుర్తి-హైదరాబాద్ ప్రధాన రహదారి మూడు లైన్లుగా వేయడం వల్ల ప్రతిరోజు ఈ రహదారిపై ప్రమాదాలు జరిగి ఎంతోమంది అమాయకులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మరికొంతమంది శతఘాతరులుగా మారి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇంత జరుగుతున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా తిరుపతి ప్రధాన రహదారి మూడు లైన్ల రోడ్డుగా నిర్మించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు. రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతుంది. తిరుపతి వెళ్లే భక్తులు రాత్రి వేళలో అధికంగా ప్రయాణిస్తారు. డివైడర్ లేకపోవడం వల్ల వాహనాలను ఓవర్టేక్ చేసి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వేలాదిమంది ప్రజలు చనిపోయిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నాలుగు లైన్ల రహదారిగా మార్చే అవకాశం ఉంది. హైదరాబాద్ నుంచి కల్వకుర్తి మీదుగా తిరుపతి హైవే రోడ్డు నిర్మాణం పూర్తి అయితే దాదాపు 80 కిలోమీటర్లు తగ్గే అవకాశం ఉన్నందున హైదరాబాద్ నుంచి వచ్చే అన్ని వాహనాలు కల్వకుర్తి మీదుగా తిరుపతి వెళ్లే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే వాహనాల రద్దీ అధికమై ప్రమాదాలు సైతం పెరిగే అవకాశం ఉంది. ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు కేంద్ర ప్రభుత్వ పెద్దలు మరోసారి ఆలోచించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. కల్వ కుర్తి బైపాస్ రోడ్డు నిర్మాణానికి మాత్రమే నాలుగు లైన్ల రహదారి కోసం భూసేక రణ చేశారు. మిగతా రోడ్డు మొత్తం మూడు లైన్ల రహదారిగా నిర్మిస్తున్నారు.



సీజినల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. కె.సుధాకర్ లాల్



నవతెలంగాణ-కందనూలు
సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.సుధాకర్ లాల్ అన్నారు. బుధవారం కలక్టరేట్ ప్రాంగణంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ , టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరికి అవగహన కల్పించాలని వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు రేపటి నుండి ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య సిబ్బంది అశా కార్యకర్తల పాత్ర కీలకమని, ఇంటింటికి తిరిగి అనుమానిత లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి వారికి నిర్దారణ పరీక్షలు చేయించి, వ్యాధుల ప్రబలకుండా చూడాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులందరూ విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దని, సమయపాలన పాటించి, బాధ్యతతో మెలగాలని ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జ్వర పీడిత లక్షణాలు ఉన్న వారందరూ దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వ్యాధి నిర్ధారణకు రక్తపరీక్షలు చేయించుకోవాలనీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ వారంలో ఒకరోజు డ్రై డే కచ్చితంగా పాటించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్ దాస్, ప్రోగ్రామ్ అధికారులు డా.రవి కుమార్, డా.శ్రీనివాసులు, డా.బీమా నాయక్, డా.రాధిక, డా.కృష్ణ మోహన్ డా.ప్రదీప్, డా.ప్రవళిక జిల్లాల్లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

- కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ

నవతెలంగాణ-కందనూలు
సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాలో ఎస్సీ సంక్షేమ హాస్టల్స్ అధ్యాయన యాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలను రూ.1500 నుండి రూ.2500లకు పెంచాలని విద్యార్థుల ప్యాకెట్ మనీ రూ.వెయ్యి ఇవ్వాలన్నారు. మెనూ సక్రమంగా అమలు చేసి విద్యార్థులకు పోషకాహారాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టల్లో మరుగుదొడ్లు సాఫ్ చేయడానికి స్కానిజర్ వర్కర్‌ను నియమించాలన్నారు. 10 మరుగుదొడ్లకు, 10 బాత్రూమ్‌లకు డోర్లు లేవని దీన వ్యవస్థలో విద్యార్థులు గడుపుతున్నారన్నారు. బెడ్లు, పెట్టెలు, ప్లేట్లు, మూడేళ్ల క్రితం ఇచ్చినవి ఉన్నాయన్నారు. అదనపు గదులను నిర్మించాలన్నారు. విద్యార్థుల పోటీ పరీక్షల మెటీరియల్ ప్రభుత్వం అందించాలన్నారు. విద్యార్థులకు సన్నబియ్యమిస్తున్నామని పదేపదే చెబుతున్నారు కానీ, అవి అమలు కావడం లేదన్నారు. విద్యార్థుల లైబ్రరీలో పోటీ పరీక్షల మెటీరియల్ ఇవ్వాలన్నారు. ఆట వస్తువులు అందించాలన్నారు. సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారులు 3 నెలలకోసారి తనిఖీ చేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపుదలకు తక్షణమే బడ్జెట్ కేటాయించాలన్నారు. హాస్టల్‌కు ప్రభుత్వ వైద్యాధికారులు నెలకోసారి సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమస్యల్ని తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న, జిల్లా ఉపాధ్యక్షులు బక్క కృష్ణ, శివరాం, సత్యనారాయణ, కృష్ణ, రాములు, శివ విద్యార్థులు పాల్గొన్నారు.



బీసీ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందికొండ గీత
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా
- కాలనీలో పర్యటించిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్



నవతెలంగాణ-కందనూలు
పట్టణంలోని 17వ వార్డు సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందికొండ గీత డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో తీవ్రమైన సమస్యలు ఉన్నాయని, కనీస సౌకర్యాలు లేవన్నారు. రోడ్లు, వీధి దీపాలు వేయాలన్నారు. పీహెచ్‌సీ సెంటర్, అంగన్వాడి కేంద్రాన్ని నిర్మించాలని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని, మిషన్ భగీరథ మంచినీరు అందించి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని డిమాండ్ చేశారు. కాలనీకి వెళ్లాలంటే ప్రధాన రహదారి లేదని శ్రీపురం రోడ్డు నాగనూలు రోడ్డుకు లింకు రోడ్డును ఏర్పాటు చేయా లని డిమాండ్ చేశారు. ఈ సమస్యలతో ధర్నా నిర్వహించడంతో మున్సిపల్ చైర్మన్ కల్పనా భాస్కర్ గౌడ్ కమిషనర్‌తో కలిసి వార్డులో పర్యటించారు. కాలనీలోని సమస్యలను ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ యాదయ్య మండల కార్యదర్శి అశోక్, రామయ్య, మధు, సత్యనారాయణ, రవి, ఈశ్వరమ్మ రాఘవేందర్, హుస్సేన్, వెంకటయ్య,రాజు,బాలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజమే

- మండల నోడల్ అధికారి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తెలకపల్లి
ఉద్యోగులకు బదిలీలు, ప్రమోషన్లు సహజమేనని మండల నోడల్ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నముద్దునూరు ప్రాథమికోన్నత పాఠశాల నుండి ఇటీవల బదిలీలు, ప్రమోషన్లపై వెళ్తున్న ఉపాధ్యాయులకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు ఎక్కడ ఉన్నా అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాలన్నారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి మాకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడం మాకు ఎంతో బాధగా ఉందన్నారు. అనంతరం పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయుడు సాజిద్ విద్యార్థులకు నోటుబుక్కులు, పలకలు, పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్లను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ శేఖర్ రావు, పదోన్నతులపై వెళ్లిన ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, సాజిద్, మల్లయ్య, బదిలీపై వెళ్లిన రాజశ్రీ, సాయిప్రకాష్, పాఠశాల ఉపాధ్యాయులు శకుంతల, శ్రీలత, ఉమాబాయి, రాజవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలిసారిగా సొంత నియోజకవర్గానికి సీఎం

- 28న జైపాల్ రెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొనున్న సీఎం



నవతెలంగాణ-కల్వకుర్తి
తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన సొంత నియోజకవర్గం కల్వకుర్తిలో పర్యటించనున్నారు. ఈనెల 28న నియోజకవర్గంలో పర్యటించి వివిధ కార్యక్రమాలలో పాల్గొంటారు. మున్సిపాలిటీ పరిధిలోని కొట్ర గేటు సమీపంలో కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరిస్తారు. అనంతరం కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభలో సీఎం మాట్లాడుతారు. సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

సీఎం రాకతో నియోజకవర్గానికి వరాల జల్లు కురిసేనా..!

సొంత నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటిస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతానికి వరాల జల్లు కురిసేనా అనే అభిప్రాయం వ్యక్తమౌతుంది. నియోజకవర్గ ప్రజలు సీఎంపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా 100 ఎకరాలలో చేపట్టే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో పాటు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతోపాటు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేకంగా సీఎం నిధులు కేటాయించే అవకాశం ఉంది. దాదాపు వెయ్యి కోట్ల రూపాయల ప్రత్యేక నిధులు మంజూరు చేయించేందుకు ఈ ప్రాంతానికి చెందిన నాయకులు సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిపాదనలు అందజేసినట్లు సమాచారం. సీఎం రాకతో కల్వకుర్తి నియోజకవర్గ రూపు రేఖలు పూర్తిగా మారే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సొంత ప్రాంతంపై సీఎం ఏమాత్రం ప్రేమ చూపిస్తారో చూడాలి..!

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై

నవతెలంగాణ-వెల్దండ
మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రజలు ముసురు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వెల్దండ ఎస్సై కురుమూర్తి సూచించారు. బుధవారం వెల్దండలో ఎస్ఐ మాట్లాడుతూ ప్రధానంగా మట్టి మిద్దే ఇళ్లలో నివసించే ప్రజలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అత్యవసర సమయంలో 100కు కాల్ చేయాలని ఎస్ఐ తెలిపారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై.. అట్రాసిటీ కేసు నమోదు

కల్వకుర్తి : మండలంలోని ఎల్లికల్ తాండాకు చెందిన గిరిజన మహిళను దూషించిన కల్వకుర్తి పట్టణానికి చెందిన డేరంగుల వెంకటేష్ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై మాధవరెడ్డి తెలిపారు. కులం పేరుతో దూషించ డమే కాకుండా దాడికి పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడం తో డేరంగుల వెంకటేష్ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ఈ కేసుపై సాక్షులను విచారి స్తారని ఆయన తెలిపారు. 2022లో సైతం ఇతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు తెలిపారు. చట్టాలను ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వేలం పాటకు వాహనాలు : ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్

నవతెలంగాణ-నాగర్‌కర్నూల్ రూరల్
నాటుసారా అక్రమ రవాణా కేసులలో జప్తు చేయ బడిన 2 వాహనాలను శుక్రవారం ఉదయం 11గంటలకు పట్టణంలోని మద్య నిషేధ, ఆబ్కారీ స్టేషన్ ఆవరణలో వేలంపాట నిర్వహించనున్నట్లు మద్య నిషేధ, ఆబ్కారీ ఇన్‌స్పెక్టర్ జి.కళ్యాణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూలు పరిధిలో జప్తు చేయబడిన వాహనాలు త్రీ వీలర్ ఆటో, టూ వీలర్ టీవీఎస్ ఎక్సెల్‌లు ఉన్నాయి. ఈ వాహనాల వేలం పాటను జిల్లా మద్య నిషేధ అధికారిని డి.గాయత్రి ఆధ్వ ర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు తగిన మోతాదులో ధరావత్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.



భూముల పరిశీలన

నవతెలంగాణ-మరికల్

మండల కేంద్రంలోని ఆత్మకూరు వెళ్లే రోడ్డు పక్కన గల సర్వే నంబరు 449లో గల 155ఎకరాల ప్రభుత్వ పట్టా భూములను ప్రజా సంఘాలు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి.వెంకట రామరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ రైతులతో కలిసి పంట భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40ఏళ్ల క్రితం ఆనాటి ప్రభుత్వం ఇచ్చిన భూములను గత బీఆర్ఎస్ ప్రభుత్వం బలవంతంగా రైతులను లాక్కోవాలని చూసిందన్నారు. రైతులు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేసిన పోరాటం ఫలితంగా భూములను నిలుపుకున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల సందర్భంగా రైతులందరికీ తిరిగి కొత్త పాస్ పుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ భూములకు వెంటనే పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతుల పైన ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో భూసాధన కమిటీ నాయకులు మల్లేష్, సుదర్శన్, భీమరాజు పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ సౌభాగ్య లక్ష్మి



నవతెలంగాణ-ఊట్కూర్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవా ల సంఖ్య పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సౌభాగ్య లక్ష్మి అన్నా రు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య, ఎన్సీడీప విధంగా జరుగుతున్న విధాన వివరాల ను ఆమె అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల సంఖ్య పెంచాలని, ఎన్సీడీ స్క్రీనిం గ్ సరైన విధంగా ప్రణాళికా ప్రకారం నిర్వహించాలని వైద్యాధికారులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ భవాని డాక్టర్ శ్రీలత, ఆరోగ్య విస్తరణ అధికారి విజయకుమార్, పర్యవేక్షకులు మణిమాల, నర్సింహులు, ఎన్సీడీ నర్సింగ్ ఆఫీసర్ రాజశ్రీ, ఫార్మసిస్ట్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-మక్తల్

లయన్స్ క్లబ్ మఖ్తల్ భీమా ఆధ్వర్యంలో లయన్ శరణప్ప సహ కారంతో బుధవారం మఖ్తల్ పట్ట ణంలోని అంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేసినట్లు అధ్యక్షుడు డీవీ.చారి తెలిపారు. లయన్ శరణప్ప కోడలు గీతా అంబ్రేశ్ జన్మది నం పురస్కరించుకొని సుమారు 300 మందికి పైగా అన్నదానం చేశారు. ఆల యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ శ్రవణ్ కుమార్ రెడ్డి, కోశాధికారి అంజన్ ప్రసాద్, సీనియర్ సభ్యులు కోళ్ళ వెంకటేష్, కట్టా వెంకటేష్, మఠం వాదిరాజ్, నాగరాజ్, మామిళ్ల పృథ్వీరాజ్, జుబేర్, రఘు ప్రసన్న భట్, రవికుమార్ గౌడ్, కుటుంబ సభ్యులు పారిజాత, అజయ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-మక్తల్

హైదరాబాద్ విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ వారు మక్తల్ మండల పరిధిలోని చిట్యాల పసుపుల పాఠ శాలల్లో చదువుతున్న దాదాపు 200 మంది ప్రాథమిక స్థాయి విద్యార్థిని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిల్స్, స్లేట్స్, పెన్స్ ను ఫౌండేషన్ ఆర్గనైజర్ వాసుదేవరావు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.సవితల చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు అందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు కావలసిన నోటు పుస్తకాలు పెన్సిల్స్ అందించినందుకు విద్యా స్వేచ్ఛ ఫౌండే షన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఆర్గనైజర్ వాసుదేవ రావు మాట్లాడుతూ మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర మొత్తంలో ఎన్నో స్కూళ్ల లో చదువుకునే పిల్లలకు కావలసిన సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, పిల్లలు రోజువారీగా బడికి వచ్చి టీచర్లు చెప్పిన పాఠాలు విని బాగా చదువుకోవాలని, పాఠశాలకు ఇంకేమైనా అవసరమైన వసతులు ఉంటే ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం మాకు తెలియజేస్తే వాటిని కల్పించేందుకు శాయశక్తుల కృషి చేస్తామన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు విదుర్ కుమార్, రవీందర్ రెడ్డి, వరలక్ష్మి, జ్యోతి, విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ ప్రతినిధులు లక్ష్మణ్, నితిన్, విజయ్, చంద్రశేఖర్లు పాల్గొన్నారు.

చెట్లే జీవనాధారం : ఎస్సై భాగ్యలక్ష్మీ రెడ్డి

నవతెలంగాణ-మక్తల్



మండలంలోని పోలీస్ స్టేషన్‌లో వరణలో వనమహోత్సవంలో భాగంగా ఎస్సై వై.భాగ్యలక్ష్మి రెడ్డి మొక్కలు నాటా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మానవ మనుగడకు చెట్లు జీవన ఆధార మని ప్రతి ఇంటి ఆవరణలో నాలుగు మొక్కలు నాటాలని మొక్కలు పెంచడం వల్ల వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ఎస్సై అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

28 నుంచి అంబేద్కర్ దూరవిద్య తరగతులు

నారాయణపేట : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సెకండ్ సెమిస్టర్ తరగతులు ఈనెల 28వ తేదీ ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5గంట ల వరకు తరగతులు నిర్వహించబడుననీ సమన్వయకర్త భాస్కర్ రెడ్డి బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన కేంద్రం : బీఎస్ఎఫ్

నాగర్‌కర్నూల్ రూరల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించకపోవడం దుర్మార్గకరమైన చర్య అని బహుజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి అరకొర నిధులు కేటాయించడం బాధాకరమన్నారు. బీజేపీ ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. నూతన జాతీయ విద్య విధానం పేరుతో విద్యను కార్పొరేటీకరణ చేయుటకు పెద్దపీట వేస్తుందన్నారు. యూనివర్సిటీల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటా యించ కపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. గత బడ్జెట్‌తో పోలిస్తే 4వేల కోట్లు తగ్గించడం సరైంది కాదన్నారు. విభజన హామీల్లో తెలంగాణకు ట్రిపుల్ ఐటి, జిల్లాకు ఒక కేంద్రీయ విద్యాలయం, నవోదయ పాఠశాల, గిరిజన యూనివర్సిటీ వంటి వాటికి నిధులు కేటాయించకుండా బడ్జెట్ ప్రవేశపెట్టడం బాధాకరమన్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం విద్యాభివృద్ధిపై పునరాలోచించి నిధులు పెంచాలని కోరారు.

పాఠశాలల సమయాల్లో ఆర్టీసీ బస్సులు నడపాలి : ఎమ్మెల్యే

నవతెలంగాణ - ఊట్కూర్



పాఠశాలల సమయంలో ఆర్టీసీ బస్సులను నడపాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కోరారు. బుధవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమయ్యే సమ యానికి మన ప్రభుత్వంలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందించామన్నారు. అయి తే వారు పాఠశాలకు వెళ్లేందుకు సరైన సమయానికి బస్సులు వస్తున్న కొంత బస్సుల కొరత ఉందని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తే వారు కూడా దానికి సానుకూలంగా స్పందించి, కొన్ని కొత్త బస్సులను కూడా మంజూరు చేసి, కొత్త రూట్‌లలో నడిపించారని తెలిపారు. అందు కుగాను సంబంధిత మంత్రి, అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సభా ముఖంగా కృతజ్ఞ తలు తెలిపారు. ఇంకా అక్కడక్కడ కొంత బస్సుల కొరత కూడా ఉంది దాని కూడా త్వరలో పూర్తి చెయ్యాలని కోరారు. ఈ విధంగా చేసినట్లయితే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చదువుకోవడానికి వీలు అవుతుందన్నారు. అదేవిధంగా ప్రైవేటు పాఠశాలల బస్సులను కూడా ఫిట్నెస్‌గా ఉన్న బస్సులనే రోడ్డుపై నడిపించే విధం గా చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని నాణ్యత లేని బస్సులు నడపడం వల్ల కొన్ని ప్రమాదాలు కూడా జరిగాయని గుర్తు చేశారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి : కలెక్టర్



నవతెలంగాణ-ఊట్కూర్

విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరో హించాలని కలెక్టర్ సిక్త పట్నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు గురించి అడిగి తెలుసు కున్నారు. ఒక్కో తరగతికి ముగ్గురు విద్యార్థులు చొప్పున అనుపస్థితి(ఆబ్ సెంట్) కావడంపై కలెక్టర్ ఉపాధ్యాయుల ను ప్రశ్నించారు. విద్యార్థులు పాఠశాలకు సక్రమంగా రాక పోతే వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేసి పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలో ఫర్నిచర్ వృథాగా ఎందుకు వేశారని, ఏవైనా ప్రభుత్వ కార్యా లయాలకు ఫర్నిచర్‌ను పంపించాలన్నారు. అయితే ఉన్నత పాఠశాల ఆవరణలోనే ఉర్దూ మీడియం కొనసాగుతుండడం తో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలువురు గ్రామస్తులతో పాటు ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా విద్యాశాఖ అధికారి, తహసిల్దార్, ఎంపీడీవోలు ఒక కమిటీ గా ఏర్పడి గ్రామ పెద్దల సలహాలు సూచనలతో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సూచించా రు. పాఠశాలలో ఇతర సమస్యలను గుర్తించి, వాటి పరిష్కా రానికి ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందని గ్రామ పెద్దల అభిప్రాయం సేకరించాలన్నారు. పాఠశాల సమస్య లు, పరిష్కార మార్గాలను చూపుతూ ఒక నివేదిక తయారు చేసి తనకు ఇవ్వాలన్నారు. ఉర్దూ మీడియంలోని ఆరో తరగతి గదికి వెళ్లి ఓ విద్యార్థినిచేత ఉర్దూ చాప్టర్ 3 పాఠాన్ని చదివించారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలోని పదో తరగతి గదిలోకి వెళ్ళి గణిత డిజిటల్ బోధనను ఆమె పరిశీ లించారు. అందరికీ స్కూల్ యూనిఫామ్‌లు వచ్చాయాలేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

గతేడాది పదో తరగతి పరీక్షా ఫలితాలు 97శాతం వచ్చాయని, ఈ విద్యా సంవత్సరం 100శాతం ఫలితాలు సాధించాలని విద్యార్థుల కు సూచించారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై కలెక్టర్ ఆరా తీశారు. మన ఊరు-మన బడి కింద చేపట్టిన అసంపూర్తి పనులకు సంబంధించిన నివేదికను ప్రభుత్వాని కి పంపిస్తానని, ఆయా పనులపై ప్రభుత్వం త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం ఆమె వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా కొనసాగు తున్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని పీఆర్ఏఈ ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో అబ్దుల్ ఘని, తహ సిల్దార్ మమత, సూపరింటెంట్ కొండన్న, గ్రామ కార్యదర్శి శ్రీని వాస్, మాజీ సర్పంచ్ సూర్యప్రకాశ్ రెడ్డి, గ్రామ మాజీ ఉప సర్పంచ్ ఈబాదుల్ రహిమాన్, గ్రామ పెద్దలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి : కలెక్టర్



నవతెలంగాణ-నారాయణపేట

స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థి కంగా బలోపేతం కావాలని, మహిళ అభివృద్ధితోనే దేశ పురోగతి సాధిస్తుందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. దామరగిద్ద మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవ నంలో బుధవారం నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్‌కు మహిళా సమాఖ్య సభ్యులు మంగళ హారతితో స్వాగతం పలికారు. సమావేశంలో ముందుగా మండల మహిళా సమాఖ్యకు సంబంధించిన అన్ని గ్రామాల సంఘాల సభ్యుల పరిచ యం చేసుకున్నారు. మండలంలో 46 గ్రామైక్య సంఘాలు ఉన్నాయని సమాఖ్య సభ్యులు కలెక్టర్‌కు తెలిపారు. సమావే శంలోని ఎజెండా అంశాలైన సమాఖ్య పనితీరు, బ్యాంకు లింకేజీ, శ్రీనిధి తదితర వాటి గురించి సమాఖ్య కార్యదర్శి నివేదిక చదివి వినిపించారు. సమాఖ్య తరపున చేపట్టిన సీతాఫలాల ప్రాసెసింగ్ సెంటర్ లాభదాయకంగా కొనసా గిన విషయాన్ని కలెక్టర్‌కు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధితోనే దేశం పురోగతి వైపు ప్రయాణిస్తుం దని, మహిళలకు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక సహాయం పొందెలెగా నూతన టెక్నాలజీతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే విధంగా వారికి శిక్షణ ఇప్పించాలని అధికారులకు సూచించారు. సంఘాల నెలవారి సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని చర్చలు అర్ధవంతంగా జరగాలని అన్నీ అంశాలను ప్రతి సభ్యురాలికి చెరవేయాలని ఆదేశించారు. మహిళ ఎంటర్ ప్రైజెస్ సంబంధించి దామరగిద్ద మండలంలో మహిళాలు ఏ విధంగా వ్యాపారాలు నిర్వహిస్తునారని లబ్ధిదారుల నుంచి వివరాలను తెలుసుకొని వారిని సభ ముఖంగా అభినందించి మిగత వారికి మార్గదర్శకం కావాలన్నారు. అదేవిధంగా సిబ్బంది ప్రభుత్వం నిర్ణయిం చిన లక్ష్యాలకంటే ఎక్కువగా ప్రయత్నం చేసి మహిళలకు ఇతోధికంగా తోడ్పా టు అందించాలన్నారు. మహిళా శక్తికి సంబంధించి అన్ని కార్యక్రమాలను కూడా సమగ్రమైన సమాచారాన్ని గ్రామీణ స్థాయి వరకు సమాచారం ఇచ్చి ఎంసీపీలు తయారు చేసుకొని పారదర్శకంగా అమలు జరిగేలా సిబ్బంది అంద రూ పని చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల లో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారని, దామర గిద్ద మండలంలోనూ మహిళా శక్తి కాంటీన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను నిషేధిం చి స్టీల్ బ్యాంక్‌ను మండలంలో ప్రారంభించాలన్నారు. గ్రామాల వారిగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా చేసిన నిర్మాణ పనుల గురించి కలెక్టర్ మహిళా సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో సొంత భవనాలు లేని మహిళా సమాఖ్యల జాబితా ఇస్తే తాను ప్రభుత్వానికి పంపిస్తానని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలలో సమావేశాలు నిర్వహించుకుని, సమాఖ్య కార్యకలాపాలను ముందుకు సాగించాలన్నారు. కొత్త యూనిట్ల గురించి మహిళా సంఘాలకు అవగాహన కల్పించాలని సీసీలను కలెక్టర్ ఆదేశించారు. సమాఖ్య తరపున చేయాల్సినవి చాలా ఉన్నాయని, 2 నెలల తర్వాత తాను మళ్లీ సమాఖ్య సమావేశానికి వస్తానని, అంతవరకు గ్రామాల వారిగా సంఘం తరపున ఏంఏం చేస్తున్నారో ప్రణాళికను తయారు చేసుకొని రావాలన్నారు. కార్యక్రమం లో డీఆర్డీఓ రాజేశ్వరి, అడిషనల్ డీఆర్డీఓ అంజయ్య, తహసి ల్దార్ జయ రాములు, ఎంపీడీఓ శ్రీధర్, డీపీఎం, ఏపీఎం లు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నెలవారి నేర సమీక్ష



నవతెలంగాణ - నారాయణపేట

జిల్లాలో నమోదు అయ్యే ప్రతి కేసులో పారదర్శకంగా విచారణ చేపట్టి పకడ్బందీగా ఇంటరాగేషన్ రిపోర్ట్ తయారు చేసి కోర్టులో చార్జి షీట్ వేయడం ద్వారా నిందితులకు పడే శిక్షల శాతం మరింత పెంచేందుకు పోలీస్ అధికారులు కృషి చేయాలనీ ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోనీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ జిల్లా పోలీస్ అధికారులతో నెలవారి నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా పోలీస్ స్టేషన్ల పరిధి లో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను న్యాయ అధికారులు, డాక్టర్లతో సమన్వయం కలిగి ఉండి పెండింగ్ కేసులను క్లియర్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భం గా ఎస్పీ మాట్లాడుతూ కేసుల సమగ్ర విచారణ ద్వార నిందితులకు శిక్ష పడేవిధం గా చేసి బాధితులకు న్యాయం చేకూరేలా అధికారులు అందరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచారాదని సూచిం చారు. జిల్లా పరిధిలో మిస్సింగ్ కేసులను వెంటనే పట్టుకోవాలన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. ఫోక్సో, ఎస్సీ ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేయాలన్నారు. నేరాలు జరిగే ప్రదేశాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రదేశాలు హాట్ స్పాట్‌గా గుర్తించి పాయింట్ బుక్స్ ఏర్పాటు చేయాలని సూచిం చారు. బ్లూ కోర్ట్ బృంది ప్రతి పాయింట్ బుక్ ను తనిఖి చేసేటట్లు చూసుకోవా లని సూచించారు. పాత నైరస్తులు, రౌడీలు, సస్పెక్ట్‌ల కదలికలపై నిఘా ఏర్పాటు చేసి వారిని ప్రతి రోజు తనిఖీ చేస్తూ ఉండాలని తెలిపారు. అక్రమ గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలు, గుట్కాలు,ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ దందాల పై నిఘా ఏర్పాటు చేసి చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్ లో బాగంగా పట్టణాలలో, గ్రామాలలో సీసీ కెమెరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి సీసీ కెమెరాలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకునేల చూడాలని తెలిపారు. సామాజిక అంశాలపై, సైబర్ నేరాల పై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. డయల్ 100 కాల్స్ పట్ల తక్షణమే స్పందించి బాధితులకు సహాయం చేయాలని సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కి కాల్ చేయాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ఎన్. లింగయ్య, సిఐ లు శివ శంకర్, రామ్ లాల్, చంద్ర శేఖర్ రాజేందర్ రెడ్డి, దస్రు నాయక్, ఎస్ఐ లు వెంకటేశ్వర్లు, కుర్మయ్య, భాగ్యలక్ష్మి రెడ్డి, నవీద్, మురళీ, రమేష్, అబ్దుల్ ఖాదర్, రాజు, రామ్ లాల్, వెంకటరమణ, కృష్ణ దేవ్, సునిత తది తరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : షీ టీమ్



నవతెలంగాణ - నారాయణపేట

ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు బుధ వారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ బాలా జీ ఐటిఐ కాలేజీలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీమ్ పోలీసులు బాలరాజు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని అన్నారు. కాలేజీలలో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వల్ల విద్యార్థులు భయంతో సూసైడ్ చేసుకునే అవకాశా లుంటాయి, కాబట్టి అలాంటి వాటికి దూరంగా ఉండాలని, చాలా మంది విద్యార్థులు చదువులు మధ్యలో ఆపేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే పేట షీ టీం సెల్ నంబర్ 8712670398 పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై తమ లక్ష్యాల ను నెరవేర్చుకోక ఇతర చెడు వ్యసనాలకు అలవాటు పడటం జరుగుతుందని, అలాంటి వాటికి దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ కనబరిచి తమ నైపుణ్యానాలను పెంపొందించుకొని ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రు లకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, షీ టీం పోలీసులు సమీనా, చెన్నయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి

- ప్రజా సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయించాలి
- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఎలుగొండ మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ - ఊరుకొండ



కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలంగాణకు బడ్జెట్లో అన్యాయమే జరుగుతుం దని.. తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి ఎన్ని సార్లు కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసిన బడ్జెట్ కేటాయింపులో మాత్రం తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూయించిందని నాగర్కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఎలుగొండ మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించడంలో ఎందుకు ఇంత వివక్ష చూపుతుందని ప్రశ్నించారు. దేశానికి పెద్దన్నగా వ్యవహరించి.. తెలంగాణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని స్వయంగా ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు దేశ ప్రధానిని, కేంద్ర మంత్రులను కలిసి కోరిన పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఐటిరంగాన్ని మరింత అభివృద్ధి చేస్తూ ఐటిఐఆర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని కోరిన ప్పటికి కేటాయింపు చేయకపోవడం బాధాకరమని ఎద్దేవ చేశారు. వెనుకబడిన తెలంగాణ ప్రాంత అభి వృద్ధికి.. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణా నికి జాతీయ హెూదా కింద నిధులు ఇవ్వక పోవడం తెలంగాణ రైతులను, ప్రజలను అవమాన పరిచినట్లే నని ఆవేదనవ్యక్తం చేశారు. కృష్ణ, వికారాబాద్ రైల్వే లైన్ ఏర్పాటుపై బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు చేయకపోవడం దారుణంగా ఉందని అన్నారు. రెండు రాష్ట్రాలు ఒకే సారి ఏర్పాటు జరిగిన ఆంధ్రకు నిధుల వరద పారించి, తెలంగాణకు మొండి చేయి చూపించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 17ఎంపి సీట్లకుగాను 8మంది బీజేపీ ఎంపిలను తెలంగాణ ప్రజలు గెలిపిస్తే, తెలంగాణకు నిధులు తీసుకోని రాలేకపోయినా 8మంది బిజెపి అసమర్థత ఎంపిలు, ఆపార్టీ నాయకులు, తెలంగా ణలో ఏ మొఖం పెట్టుకొని తిరుగుతా రో వారే చెప్పాలని డిమాండ్ చేశారు. దేశమంటే కొన్ని రాష్ట్రాల అభివృద్ధి మాత్రమే కాదని, అన్ని రాష్ట్రాలు అభివృద్ధి సాధించి నప్పుడే దేశం అభి వృద్ధి చెందుతుందన్న విషయాన్ని మర్చిపోవద్దని అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ పట్ల మోడీ ప్రభుత్వ వివక్ష ఎంత ఉందో ప్రజలు ఈ సందర్భంగా గమనించాలని, బీజేపీ ఎంపీలను ప్రజలు నిలదీయాలని కోరారు. తెలంగాణలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, కొత్త రైల్వే లైన్లు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐ ఆర్ ప్రాజెక్ట్ ల ఊసేలేదని గుర్తు చేశారు.

కేంద్రం మొండి వైఖరి విడాలి : కాంగ్రెస్

నవతెలంగాణ - బిజినేపల్లి

పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ఎలాంటి బడ్జెట్ ప్రవేశ పెట్టకపో వడం తెలంగాణపై కక్ష సాధింపు చర్యగా అభివర్ణించవచ్చని కేంద్రం మొండి వైఖరిని విడనాడి తెలంగాణకు నిధులు కేటాయించాని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బత్తిని అమృత్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీఅధికారంలో ఉందన్న దురుద్దేశంతో బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు బడ్జెట్‌లో మొండిచేయి చూయించిందని ఎద్దేవా చేశా రు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణకు ప్రధాని కాదా అని ప్రశ్నించారు. తెలంగాణలోని బీజేపీ ఎంపీలు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి ఎమ్మెల్సీ కూచు కుల్ల దామోదర్ రెడ్డి ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి పేదోడికి సంక్షేమ ఫలాలు అందజేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆగస్టు 15 లోపు రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతామన్నారు. త్వరలోనే డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, పింఛ న్లు తదితర సంక్షేమ పథకాలు ప్రారంభించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ముక్తార్ పాషా, కత్తె ఈశ్వర్, మస్యూరి, బంగారయ్య, జగ్గని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు

- రోడ్డు నిబంధనలు పాటించాలి : డీఎం
- టీజీఎస్ఆర్ టీసీ ప్రమాద రహిత వారోత్సవాలు



నవతెలంగాణ- కందనూలు

మద్యం తాగి వాహనాలు నడపరాదని నాగర్‌కర్నూల్ డిపో మేనేజర్ డ్రైవర్లకు సూచించారు. టీజీఎస్ఆర్ టీసీలో ప్రమాద రహిత వారోత్సవాలలో భాగంగా నాగర్‌కర్నూల్ డిపోలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ రఘు, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ లెక్చరర్ నరసింహులు హాజరై మాట్లాడారు. డ్రైవర్లు ఏకాగ్రత తో డ్రైవింగ్ చేయాలన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఆర్టీసీ సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డ్రైవర్ ఎట్టి పరిస్థితుల్లో డ్యూటీలో ఉన్నప్పుడు మద్యం సేవించరాదన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ బాల సరస్వతి, అసిస్టెంట్ మెకానికల్ ఫోర్ మెన్ భాస్కర్, ఏడీసీలు ఏజే ప్రకాష్, జలీల్, ఎస్ డీఐఎం రవికుమార్, వీఎస్.నారాయణ, శ్యాంసుందర్ రెడ్డి, లక్ష్మయ్య, అశోక్‌రెడ్డి, వంశీధర్ రావు, కే.శ్రీనివాసులు, బాలరాజు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతు బీమా దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ - తిమ్మాజిపేట

రైతు బీమా దరఖాస్తులు 75 స్వీకరించినట్టు మండల వ్యవసాయ అధికారి కమల్ కుమార్ బుధవారం తెలిపారు. మండల రైతులు రైతు బీమా కోసం దరఖాస్తులు చేసుకోవాలని మండల మండల వ్యవసాయ అధికారి కుమార్ తెలిపారు. వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అర్హత ఉంటుం దని తెలిపారు. పట్టా పాస్ బుక్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డులు, తీసుకొని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల 5వ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
జోగులాంబ-గద్వాల
గురువారం | జూలై 25, 2024 | www.navatelangana.com

కార్పొరేటర్లకు లాభాలు.. పేదలపై భారాలు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకటస్వామి



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్‌లకు లాభాలు తెచ్చే పెట్టి విధంగా పేద ప్రజలపై భారం మోపే విధంగా ఉందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి విమర్శించారు, తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన బడ్జెట్ నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని వైయస్సార్ చౌరస్తా ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేటర్లపై వారి ఆదాయానికి తగ్గ పన్నులు ఎందుకు విధించడం లేదని ప్రశ్నించారు గత బడ్జెట్లో 30శాతంగా ఉన్న పన్నులను ఈ బడ్జెట్ లో 22 శాతానికి ఎందుకు తగ్గించారని ప్రశ్నించారు. సంపన్నుల మీద విధించే వారసత్వ పన్నును కనీసం ప్రతిపాదించదానికి కూడా నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు . రెవెన్యూ రాబడులను 14.5శాతం చూయించిన ప్రభుత్వం ప్రజల నుంచి సేకరించిన రాబడిని వారి కోసం ఖర్చు చేయకుండా రెవెన్యూ ఖర్చులు కేవలం 5.91 శాతానికి ఎందుకు తగ్గించిందని నిలదీశారు. వ్యవసాయం ఆహారం ఎరువులు గ్రామీణ ఉపాధి హామీ పథకానికి భారీగా నిధుల కోతలు పెట్టి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుపై ప్రస్తావన తీసుకురాలేదని పరిశ్రమల స్థాపన జరగకుండా ఉపాధి సృష్టి జరగకుండా సంపద ఏ విధంగా పేరుగుతుందని ప్రశ్నించారు. నైపుణ్య శిక్షణ అభివృద్ధి చేయడం కోసం రెండు లక్షల కోట్లు కేటాయించామని ప్రగల్భాలు పలుకుతున్న కేంద్ర ప్రభుత్వం ఉపాధి సృష్టి లేకుండా వృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో 30 లక్షల ఉద్యోగాలు ఖాళీలు ఉంటే వాటిని భర్తీ చేయకుండా కేవలం శిక్షణ ఇస్తామంటే ఉద్యోగ అవకాశాలు ఎలా కల్పిస్తారన్నారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న బడ్జెట్లో కనీసం తెలంగాణ పేరు ప్రస్తావించకపోవడం కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ పట్ల పక్షపాత ధోరణి తెలియజేస్తుందని అన్నారు.విభజన హామీలు నెరవేర్చకుండా పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం రైల్వే ప్రాజెక్టులు విద్యాసంస్థల కు నిధులు కేటాయించకుండా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని భాగస్వామ్య పక్షాలను సంతృప్తి పరచడం కోసం బడ్జెట్‌ని కేటాయించడం దారుణం అన్నారు. జీడీపీలో అధిక నిధులు సమకూర్చే దక్షిణ భారతదేశానికి పూర్తి అన్యా యం చేసిందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకార సమాఖ్య స్ఫూర్తి గురించి గొప్పలు చెప్పే పెద్దలు నిధుల కేటాయింపులో ఈ వివక్ష ఏమిటని ప్రశ్నించారు. కార్పొరేటర్లకు లాభాలు పేద ప్రజలపై భారాలు మోపే బడ్జెట్‌ను ఈ తిరోగమన బడ్జెట్ ని ప్రజల వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ , నాయకులు శివ,పరశురాం,అశోక్ ,అంజి, మల్లయ్య, నరేష్, రాఘవేంద్ర , గోవిందు, రాము తదితరులు పాల్గొన్నారు.

హరితహారం లక్ష్యం పూర్తి చేయాలి

- మండల అభివృద్ధి అధికారి అంజిరెడ్డి

నవతెలంగాణ - ఉండవల్లి

ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఇచ్చిన టార్గెట్ ప్రకారం హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలని మానవపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి అంజిరెడ్డి అన్నారు. బుధవారం మానవపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి ఇచ్చిన టార్గెట్ 51 మొక్కలని ఆ లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో చేరుకోవాలన్నారు. పంచాయతీ సెక్రెటరీలు బాధ్యత తీసుకొని గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లు మొక్కలు విరి వి రి గా నాటాలని సూచించారు. అనంతరం గ్రామాలు పరిశుభ్రత , విష జ్వరాలు సోకకుండా తగు చర్యలు తీసుకోవాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఓ విజయ శంకర్ నాయక్ , టెక్నికల్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు , ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లి ఎంపీఓగా తిరుపతన్న

నవ తెలంగాణ - ఉండవల్లి



కొత్త ప్రభుత్వం అధికారుల బదిలీలో భాగంగా ఉండవల్లి ఎంపీఓగా తిరుపతన్న బాధ్యతలు చేపట్టారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీరాజ్ శాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. ఈయన ఇటికాల ఎంపీఓగా విధులు నిర్వహించి బదిలీ అనంతరం ఉండవల్లికి వచ్చినట్లు అధి కారులు వెల్లడించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీఓ పద్మావతమ్మ అల్లంపూర్ మండలానికి బదిలీపై వెళ్లినట్లు అధికారులు తెలిపారు.

నదిలో దుకేందుకు యత్నించిన.. మహిళను కాపాడిన ఇటిక్యాల పోలీసులు



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

కుటుంబ కలహాలతో బీచుపల్లి పుష్కర ఘాట్ దగ్గరకు వచ్చి నదిలో దూకి చనిపోయేందుకు యత్నించిన వనపర్తి జిల్లాకు చెందిన మహిళను ఇటిక్యాల బ్లూ కోల్ట్స్ సిబ్బంది రక్షించి కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ (26) కుటుంబ కలహాల తో జీవితం పై విరక్తి చెంది బుధవారం ఉదయం ఇటిక్యాల మండలం లోని బీచూపల్లి పుష్కర ఘాట్ కు వచ్చి నదిలో దూకేందుకు ప్రయత్నించగా అక్కడే విధులలో ఇటిక్యాల బ్లూ కోర్ట్స్ సిబ్బంది శ్రీనివాస్, వరద రాజులు ఆమెను గుర్తించి నదిలోకి వెళ్లకుండా అడ్డుకొని ఎర్రవల్లిలోని పోలీస్ ఔట్ పోస్టు నందు కౌన్సెలింగ్ నిర్వహించి అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు. తక్షణమే బ్లూ కోల్ట్స్ సిబ్బంది స్పందించి మహిళా ప్రాణాలను కాపాడటం పట్ల ఎస్పీ టీ.శ్రీనివాస రావు బ్లూ కోల్ట్స్ సిబ్బందిని అభినందించారు.

పోస్టర్ల విడుదల



నవతెలంగాణ - గట్టు

మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ గట్టు మండలం అధ్యక్షులు నరసింహా ఆధ్వర్యంలో ఈ నెల 26 27 28 హైదరాబాదులో జరిగే ఫోటో ఎక్స్పో పోస్టర్లను గట్టు ఎస్సై కె టి మల్లేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. హైదరాబాదులో జరిగే కార్యక్రమంలో గట్టు మండలంలో ప్రతి ఒక్కరూ హాజరుకావాలని ఫోటో గ్రాఫర్ గట్టు మండల అధ్యక్షుడు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యక్షులు, వెంకటేష్ , వీరేష్, సుధీర్ , వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి వినతి



నవతెలంగాణ - ఉండవల్లి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లాల్లో కెనరా బ్యాంకులో ఉన్న తెలంగాణ రైతులకు పంట రుణమాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే విజయుడు వినతి పత్రాన్ని అందజేశారు. బుధవారం హైదరాబాదులో క్యాంపులో ముఖ్యమంత్రిని కలిసి అల్లంపూర్ నియోజకవర్గం లోని మానవపాడు మండలంలోని వివిధ గ్రామాల్లోని వ్యవసాయ రైతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా కెనరా బ్యాంకుల్లో బ్యాంకు లోన్లు పంట రుణాల కోసం తీసుకొన్న రైతుల రుణాలు మాఫీ చేయాలని కోరారు. కలిసి ఉన్నప్పుడు సమీపంలో ఉన్న రైతులు కర్నూలు జిల్లాలోని రుణాలు తీసుకునే వారని అప్పుడు బ్యాంకులో సహకరించడంతో ఆ రుణాలు అలాగే కొనసాగుతున్నాయని సీఎంకు తెలిపారు. సీఎం స్పందించి అధికారుల నివేదికల ద్వారా సేకరించి రైతులకు మాఫీ చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలి

- కలెక్టం బీ. ఎం సంతోష్

నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

అధిక ఆదాయాన్నిచ్చే ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించి రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ బీ.ఎం. సంతోష్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఎర్రవల్లి మండలం బీచుపల్లిలోని టీ.జీ. ఆయిల్ ఫెడ్, ఆయిల్ ఫామ్ నర్సరీ, ఆయిల్ పామ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నర్సరీలోని ఆయిల్ ఫాం మొక్కలను పరిశీలిస్తూ మొక్కల సేకరణ, వాటిని నాటడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి పారుదలతో పాటు సాగుకు సంబంధించిన వివరాలను సంబంధితులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జిల్లాకు టార్గెట్ 2 లక్షలు మొక్కలు అవసరమని, సంవత్సరం నుంచి రెండున్నర సంవత్సరాల మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ఇంత వరకు 36,000 మొక్కలు రైతులకు పంపిణీ చేశామని, ఇంకను 63,000 మొక్కలు నర్సరీలో అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. అలాగే నర్సరీలోని కల్లింగ్ మొక్కల వివరాలు సాగులో తీసుకుంటున్న జాగ్రత్తలు, మెళకువలు, ఎరువుల యాజమాన్యం, మొక్కల సంరక్షణ, కలుపు నివారణ, నీటి వసతి తదితర అంశాలపై వారు కలెక్టర్‌కు తెలిపారు. ఆయిల్ పామ్‌తో పాటు వివిధ రకాలకు చెందిన అంతర పంటలను కూడా సాగు చేసి దీని ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన తరువాత నాలుగో సంవత్సరం నుంచి దిగుబడులు ప్రారంభం అవుతాయని, 30సంవత్సరాల వరకు ఈ మొక్క దిగుబడి ఇస్తూ రైతులకు ఆదాయాన్ని ఇస్తుందన్నారు. ప్రభుత్వం కూడా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ పెద్ద ఎత్తున రాయితీలను ఇస్తుందన్నారు. రైతులు ఆయిల్ ఫాం సాగు చేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో ప్రచారం చేసి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. స్వల్ప పెట్టుబడితో అధిక ఆదాయాన్నిచ్చే ఆయిల్ ఫాం సాగు విషయంలో ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక చర్యలపై గ్రామాల్లో ప్రతి రైతుకూ అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ కొండపేట గ్రామంలో ఒక రైతు యొక్క ఆయిల్ పామ్ తోటను సందర్శించారు. ఆయిల్ పామ్ తోట సాగు పద్ధతులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, ఆ రైతుతో సాగు డ్రిప్ ఇరిగేషన్ పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తిమ్మాపూర్‌లోని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో



భాగంగా మరో ఆయిల్ పామ్ తోటను సందర్శించి, అక్కడ ఓ మొక్కను నాటారు. "ఆయిల్ పామ్ సాగుతో రైతుల ఆర్థికస్థితిలో పురోగతి వస్తుందని తెలిపారు. మునగాల గ్రామ శివారులోని మూడు సంవత్సరాల ఆయిల్ ఫామ్ తోటను, షాబాద్ గ్రామంలో ఉన్న నాలుగు సంవత్సరాల ఆయిల్ ఫామ్ తోటను కలెక్టర్ పరిశీలించారు. తోటలోని గెలల సేకరణ, హార్వెస్టింగ్ విధానాలను పరిశీలించి రైతులకు ఆయిల్ పామ్ సాగుపై మరింత అవగాహన కల్పించడంపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన వన శాఖ అధికారి అక్బర్ అలీ, నర్సరీ ఇన్‌చార్జ్ చంద్ర శేఖర్ , అన్ని మండలాల ఉద్యాన వన శాఖ అధికారులు, టీ.జీ ఫెడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - గట్టు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు బాసు హనుమంతు నాయుడు ఆదేశాల మేరకు.. గట్టు మండలం కేంద్రంలో బుధవారం కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయ కులు అంగడి బస్వరాజు, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, బాసు గోపాల్, ఎల్లం దొడ్డి రాజు నాయుడు, మాచర్ల లోకేష్, బాసు బోజ్జయ్య, బోయల గూడెం వాల్మీకి నాగరాజు, రాయాపురం వీరేష్, గట్టు టీఆర్ఎస్ వెంకటేష్, కంగారు తిమ్మప్ప, తిమ్మారెడ్డి, రాజు గోపాల్, రాజు, దోర్నాల వీరేష్, కర్రెప్ప, నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



నవతెలంగాణ - ధరూర్



కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ధరూరు మండల కేంద్రంలో బాసు శ్యామల,బాసు హనుమంతు నాయుడు, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు,బ్రెడ్లు పంపిణీ చేశారు. అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అంగడి బస్వరాజు, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, బీరెల్లి బీచుపల్లి, నాగరాజు, తిరుమల్, ఆటో ముక్బూల్, బాసు గోపాల్, ఎల్లం దొడ్డి రాజు నాయుడు, మోనేష్, గార్లపాడు పరుషరామ్, గంగన్న, గోవిందు, మాచర్ల లోకేష్, బాసు బోజ్జయ్య, రాయాపురం వీరేష్, గట్టు టీఆర్ఎస్ వెంకటేష్, కంగారు తిమ్మప్ప, తిమ్మప్ప, తిప్పయ్య, శ్రీకాంత్, నాయుడు, అబ్బు, తిమ్మారెడ్డి, గోపి, రాజు గోపాల్, రాజు, దోర్నాల వీరేష్, కర్రెప్ప, వివిధ గ్రామాల పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలంటే అరెస్టులా : పీడీఎస్‌యూ

నవతెలంగాణ - గట్టు



విద్యారంగానికి అధిక శాతం నిధులు కేటాయించమంటే అక్రమ అరెస్టులా అని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నించారు. బుధవారం పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులను గట్టు మండల పోలీస్‌లు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీం పాషా, జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ , ఫీజు రీయిం బర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలన్నారు. విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని విద్యా రంగాన్ని రాష్ట్ర బడ్జెట్లో 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని వెంటనే నియ మించాలన్నారు. అలాగే జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని వెంటనే అమలు చేయాలని, కేజీ టు పీజీ వరకు ఉచిత బస్ పాస్ లు అందించాలని వివిధ డిమాండ్లపై ఛలో అసెంబ్లీ ముట్టడికి వెళతున్నారన్న సమాచారం మేరకు.. విద్యార్థి సంఘ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో గట్టు మండల అధ్యక్షుడు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

నవతెలంగాణ - ధరూరు



సైబర్ నేరాల పట్ల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సుకూరు సూచించారు. బుధవారం ధరూర్ మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద బస్టాండ్ ఆవరణలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని బ్యాంకుల దగ్గర తదితర పరిసర ప్రాంతాలలో సైబర్ నెరగాళ్లు పసిగట్టి ఉంటారని, నేరగాళ్ల వెంట పడకుండగా చుట్టుపక్కల గమనిస్తూ ఉండాలని ఇతరులు కూడా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుకూరు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడికి వీడ్కోలు

నవతెలంగాణ - తిమ్మాజిపేట

మండలంలోని మారేపల్లి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 12 సంవత్సరాలుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన సింగరాజు యాదగిరిని తోటి ఉపాధ్యాయ బృందం విద్యార్థులు బుధవారం ఘనంగా వీడ్కోలు సమావేశం పలికారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడుకి పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు యాదగిరి పాఠశాల విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు. అలాగే పాఠశాలకు పదివేల రూపాయల విలువగల జీబ్రానిక్స్ మైక్ సెట్ ను అందించరు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి సత్యనా రాయణ శెట్టి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత, వెంకటాచారి పాఠశాల ఉపాధ్యాయ బృందం , విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోపణలు రుజువైతే చర్యలు

- ఎస్పీ శ్రీనివాసరావు



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

ఈ నెల 13వ తేది నాడు ఉండవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరం పై దాడికి సంబంధించి పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ .శ్రీనివాస రావు వివరణను ఒక ప్రకటన ద్వారా తెలిపారు. పేకాట స్థావరం పై దాడీ సందర్బంగా వచ్చిన ఆరోపణల దృష్ట్యా మీడియా మిత్రులు కూడా వివరణ కోరుతున్న సందర్భంగా ఇట్టి ఆరోపణ పై జిల్లా అదనపు ఎస్పీ కె. గుణ శేఖర్ ఆధ్వర్యంలో పూర్తి విచారణకు ఆదేశించడం జరిగిందనీ , ఈ సంఘటనలో పోలీస్ అధికారులపై , సిబ్బందిపై ఆరోపణ రుజువైతే అట్టి వారి పై తప్పకుండా శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆరోపణలకు సంబంధించిన బాధితులు ఎవరైనా ఉంటె ముందుకూ వచ్చి నేరుగా లేదా ఫోన్‌లో తమని సంప్రదించి ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి నిజమని తేలితే బాద్యులపై తప్పకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అట్టి బాధితుల వివరాలు కూడా గోప్యంగా ఉంచబడుతాయని ఎస్పీ పేర్కొన్నారు.

జూరాలకు భారీగా వరద .. 41 గేట్లు ఎత్తివేత

- కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి
- ఇన్‌ఫ్లో 1,65000 , అవుట్ ఫ్లో లక్ష 79 వేల 527



నవ తెలంగాణ - ధరూరు

ప్రియదర్శని జూరాల ప్రాజెక్టులో బుధవారం అధికారుల సమాచారం మేరకు.. ఆల్మట్టి నారాయణపూర్ డ్యాముల నుంచి భారీ ఎత్తున జూరాలకు వరద నీరు వచ్చి చేరుతోంది. అదే తరుణంలో జూరాలకు ఎగువ ప్రాంతం నుంచి ఇన్ఫ్లో లక్ష అరవై తొమ్మిది వేల క్యూస్షన్ రాగా జూరాల ప్రాజెక్టులో 41 గేట్లుఎత్తి గేట్ల ద్వారా ఒక్క లక్షల50 వేల 593 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయంలోనికి వదులుతున్నారు. అలాగే జల విద్యుత్ కేంద్రం ద్వారా ఆరు యూనిట్ల నుంచి 24వేల 688 క్యూసెక్కుల తీరును పవర్ నుంచి వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టులు నీటిమట్టం 318. 516 నీటిమట్టం ఉండగా బరగనీరు కిందికి వెళ్లడంతో ప్రస్తుతం నీటి నిల్వ 316.680 ప్రస్తుతం కొనసాగుతోంది. అదే సందర్భంగా 6.218టీఎంసీల వాటర్ ఉంచుకొని దిగువ ప్రాంతానికి నెట్టెంపాడుకు 1500 బీమా వన్ 1300 లెఫ్ట్ కెనాల్కు 820క్మ0రైట్ కెనాలకు 584 క్యూసెక్కుల నీటిని కెనాలకు వదులుతున్నారు. ప్రాజెక్టు మొత్తం మీద దిగువ ప్రాంతానికి ఒక్క లక్ష 79,527క్యూసెకల నీటిని శ్రీశైలం జలాశయంలోనికి వదులుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

'విద్యార్థులు విధిగా పాఠశాలకు రావాలి'



నవ తెలంగాణ - గట్టు

మండలంలోని మాచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలు ఎస్ హెచ్ ఈ సందర్శించారు అనంతరం విద్యార్థులకు సమావేశం ఏర్పాటు చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ 14 సంవత్సరాలు ఉన్న పిల్లలు ఎవరు కూడా పొలం పనులకు వెళ్లకూడదని అన్నారు. అంతే కాకుండా 18 సంవత్సరాలలోపు ఉన్నవారు కూడా పెళ్లిళ్ల చేసుకోకూడదని అన్నారు. అలా చేస్తే చట్టర పరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చదువుకున్న వయసులోనే చదువుకోవాలని వారన్నారు మీ భవిష్యత్‌ని మీరే కాపాడు కోవాలని అన్నారు. అంతేకానీ పాఠశాల బంద్ చేసి పొలం పనులకు వెళ్లకూ డదని సూచించారు. కనుక ప్రతిరోజు పాఠశాలకు వచ్చి మంచిగా చదువు కోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు , ఎస్ హెచ్ టీం వారు రచన ,దివ్య, హనుమంతు , పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధరూర్ ఎస్ఐగా అబ్దుల్ సుకూర్

నవతెలంగాణ - ధరూర్



ధరూరు మండల కేంద్రంలో బుధవారం పోలీస్ స్టేషన్లో నూతన ఎస్సైగా అబ్దుల్ సుకూర్ బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.